
ధర్మము

# చాణక్య నీతి సూత్రాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# చాణక్య నీతి సూత్రాలు

ఆంధ్రతాత్పర్యం

డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

సంస్కృతభాషా ప్రచార సమితి

హైదరాబాదు – 1

# తొలి పలుకు

ప్రపంచకంలోకెల్లా అతి పురాతనాలైన నాగరికతా సంస్కృతులకు నిలయమైనది భారతదేశం. ఆయా దేశవాసుల వేషభాషాదులు, రాజ్య పరిపాలనా విధానమూ, వాళ్లు సమకూర్చుకొనే వివిధ సంపదలూ, అనుభవించే భోగాలు, జీవన విధానమూ మొదలైన బాహ్యవిషయాలకు సంబంధించినది 'నాగరికత' అనీ, వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఉండే సంబంధవిశేషమూ, అభిరుచులూ, ఆధ్యాత్మికప్రవృత్తి మొదలైన ఆంతరిక విషయాలకి సంబంధించినది 'సంస్కృతి' అనీ స్థూలంగా వీటిని నిర్వచించవచ్చును. అతిప్రాచీనకాలంనుంచీ కూడా, ఈ రెండూ మన దేశంలో ఎంతో మహోన్నతస్థితిని పొంది ఉన్నాయి.

దేశంలోని ప్రతీపౌరుని యోగక్షేమాలకు ప్రాధాన్యం ఇస్తూ రూపొందించిన రాజ్యపాలనాసంవిధానం చాణక్యాదుల అర్థశాస్త్రాదులలో మనకు కనబడుతుంది. ఈ పరిపాలనావిధానం నాగరికతకు 'పరా కాష్ఠ'. ఈ చాణక్యుడే "రాజనీతి సూత్రాణి" అనే పేరుతో ఎనిమిది అధ్యాయాలలో 562 సూత్రాలు రచించినట్లు ప్రసిద్ధి. వీటిలో చెప్పిన విషయాలలో కనీసం నూటికి ఎనభై అంశాలు పరిపాలకులకూ-వారు మంత్రులు కావచ్చు, అధికారులు కావచ్చు, కుటుంబ యజమానులు కావచ్చు- పరిపాలితులకూ కూడా ఈనాడు కూడా ఉపకరిస్తాయి. ఈ సూత్రాలను ఆంధ్రభాషానువాదంతో సంస్కృతభాషా ప్రచారసమితి తెలుగువారికి అందజేస్తూ విజ్ఞులైన పాఠకులు దీనిని ఆదరించగలరని విశ్వసిస్తున్నది.

మాననీయులు శ్రీ తట్టా శ్రీరామనరసింహం గారు సుప్రసిద్ధవిద్వత్కుటుంబానికి చెందినవారు. ఆయకర (Income Tax) విభాగంలో అత్యున్నత పదవిని అలంకరించినవారు. ఇతరసంప్రదాయద్వేషం ఎరుగని ఉత్తమవైష్ణవులు. ఉన్నతపదవులలో ఉండి 'విశ్రాంతి' లభించిన తరవాత కూడ పూర్వార్జితమైన పలుకుబడితో ఏవేవో కంపెనీలు మొదలైనవాటికి ఉపకారపరంపరలు అందజేసే విశ్రాంతాధికారులు అత్యధికంగా ఉన్న ఈ కాలంలో తాదృశపరోపకార చింతా పరాఙ్ముఖులై నిరంతర సద్గ్రంథ పఠన - అనుశీలనాదుల ద్వారా ఆత్మోపకారైక పరాయణులు: అట్టి సహృదయులు దీనిని సౌహృదోపాయనంగా అంగీకరించినందుకు సంతోషిస్తున్నాను.

పుల్లెల శ్రీరామచంద్రుడు
కులపతి
సం. భా. ప్ర. సమితి

హైదరాబాదు
27-10-1994

శ్రీః

శ్రీ మహాగణాధిపతయే నమః

# చాణక్య నీతి సూత్రాలు

డాక్టరు పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన

"బాలానందినీ" వ్యాఖ్యతో

## ప్రథమాధ్యాయము

[*మంచి రాజ్యాన్ని సంపాదించడం సర్వసుఖాలకీ హేతువు*]

1. సుఖస్య మూలం ధర్మః.

అ. ధర్మం సుఖానికి మూలం.

2. ధర్మస్య మూలమర్థః.

అ. ధర్మానికి మూలం అర్థం; అనగా ధనం.

3. అర్థస్య మూలం రాజ్యమ్.

అ. అర్థానికి మూలం రాజ్యం.

4. రాజ్యస్య మూలమిన్ద్రియజయః.

అ. రాజ్యానికి (అధికారానికి) మూలం ఇంద్రియాల్ని వశంలో ఉంచుకోవడం.

5. ఇన్ద్రియజయస్య మూలం వినయః.

అ. ఇంద్రియాలను జయించడానికి మూలకారణం వినయం.

6. వినయస్య మూలం వృద్ధోపసేవా.

అ. పెద్దవాళ్ళను, విద్యావంతులను సేవించడంవల్ల వినయం అలవడుతుంది.

7. వృద్ధోపసేవయా విజ్ఞానమ్.

అ. వృద్ధుల సేవవలన విజ్ఞానం కలుగుతుంది.

8. విజ్ఞానేనాత్మానం సంపాదయేత్.

అ. పెద్దల సహవాసం చేసి సంపాదించుకొన్న విజ్ఞానంచేత తనను సంపాదించుకోవాలి. వినయం, విజ్ఞానం ఈ రెండూ లేనివాడు తనను తాను కోల్పోయినట్లే. ఆ రెండూ ఉన్నవాడు తనను తాను చక్కబరచుకొన్నవా డవుతాడు. ఆత్మసంపాదనం అంటే అదే.

9. సంపాదితాత్మా జితాత్మా భవతి.

అ. ఆత్మను సంపాదించుకొన్నవాడు తనను తాను జయించినవాడు అనగా వశంలో ఉంచుకొన్నవాడు అవుతాడు.

10 జితాత్మా సర్వార్థైః సంయుజ్యతే.

అ. ఆత్మను జయించినవాడు అన్ని లాభాలు పొందగలుగుతాడు. అర్థం అనగా సంపద, దానిని పొందుతాడు.

11. అర్థసంపత్ ప్రకృతిసంపదం కరోతి.

అ. అర్థసంపద ప్రకృతిసంపదను ఇస్తుంది. అమాత్యులు, మిత్రులు, ధనాగారం, రాష్ట్రం, దుర్గం. సైన్యం- ఈ ఆరింటికీ ప్రకృతు లని పేరు. రాజ్యపరిపాలనకు (Governing the country) కావలసినవి ఈ ఆరే. అర్థసంపద బాగుంటే ఇవన్నీ బాగుంటాయి.

12. ప్రకృతిసంపదా హ్యనాయకమపి రాజ్యం నీయతే.

అ. ప్రకృతిసంపదచేత రాజ్యవ్యవహారం నాయకుడు (పరిపాలకుడు) లేకపోయినా నడచిపోతుంది ఉదాహరణకి- అప్పుడప్పుడు ప్రభుత్వాలు పడిపోయినా ఐ.ఏ.యస్ అధికారులు, భద్రతాసైన్యాదుల అధికారులు తమ తమ కార్యాలు సక్రమంగా నిర్వర్తిస్తే లోకవ్యవహారం నడిచిపోతూనే ఉన్నది కదా

13. ప్రకృతికోపః సర్వకోపేభ్యో గరీయాన్.

అ. ప్రకృతుల విప్లవం అన్ని విప్లవాలకంటె (తిరుగుబాటుల కంటె) చాల గొప్పది; ప్రమాదకర మైనది.

14. అవినీతస్వామిలాభాత్ అస్వామిలాభః శ్రేయాన్.

అ. వినీతుడు, అనగా విద్యావినయసంపన్నుడు కాని, ప్రభువు దొరకడం కంటె ప్రభువే లేకపోవడం మంచిది.

## [మంచి ఆలోచన అవసరం]

15. సంపాద్యాత్మానమన్విచ్ఛేత్ సహాయాన్.

అ. ముందు ఆత్మను సంపాదించుకొన్న తరవాత, అనగా తనను తాను చక్కబరచుకొన్న తరవాత, సహాయుల్ని సంపాదించడం కోసం ప్రయత్నించాలి.

16. నాసహాయస్య మన్త్రనిశ్చయః.

అ. సహాయులు లేనివాడు ఏ విషయంలోను ఒక నిర్ణయం తీసుకొన జాలడు.

17. నైకం చక్రం పరిభ్రమతి.

అ. ఒక చక్రంతో బండి నడవదు కదా?

18. సహాయః సమదుఃఖసుఖః.

అ. సుఖదుఃఖాలను సమంగా పంచుకోగలిగినవాడే సహాయుడు.

19. మానీ ప్రతిమానినమాత్మని ద్వితీయం మన్త్రముత్పాదయేత్.

అ. దురభిమానం కలవాణ్ణి సహాయుణ్ణిగా తీసుకుంటే అతడు ప్రభువు ఆలోచనకు విరుద్ధంగా మరొక ఆలోచన చేస్తాడు.

20. అవినీతం స్నేహమాత్రేణ న మన్త్రికుర్వీత.

అ. స్నేహితుడు కదా అని విద్యావినయాలు లేనివాణ్ణి మంత్రిగా చేసుకో కూడదు.

21. శ్రుతవన్త ముపధాశుద్ధం మన్త్రిణం కుర్వీత.

అ. శాస్త్రజ్ఞానం ఉన్న, ఏ ప్రలోభనాలకీ లొంగనివాణ్ణి మంత్రిగా చేసుకోవాలి. ధనం, స్త్రీ మొదలైనవాటిని ఎరచూపి రహస్యంగా పరీక్షించడం (ఉపధ) అలాంటి పరీక్షలలో పరిశుద్ధుడుగా తేలినవాడు "ఉపధాశుద్ధుడు".

22. మన్త్రమూలాః సర్వారమ్భాః.

అ. అన్ని పనులకీ మూలం మంత్రం (మంచి ఆలోచన).

23. మన్త్రరక్షణే కార్యసిద్ధిర్భవతి.

అ. మంత్రాన్ని రక్షిస్తేనే కార్యాలు సిద్ధిస్తాయి.

24. మన్త్రనిఃస్రావీ సర్వమపి కార్యం నాశయతి.

అ. ఆలోచనలు బైటపెట్టినవాడు అన్ని పనులూ చెడగొట్టుకుంటాడు.

25. ప్రమాదాత్ ద్విషతాం వశముపయాస్యతి.

అ. మంత్రం విషయంలో ఏమాత్రం పొరబడినా శత్రువులకి లొంగిపోతాడు.

26. సర్వద్వారేభ్యో మన్త్రో రక్షితవ్యః.

అ. మంత్రాన్ని అన్నివైపులనుండీ రక్షించాలి.

27. మన్త్రసంపదా రాజ్యం వర్ధతే.

అ. మంత్రశక్తి బాగుంటే రాజ్యం వృద్ధిలోనికి వస్తుంది.

28. శ్రేష్ఠతమాం మన్త్రగుప్తిమాహుః.

అ. ఆలోచనలు రహస్యంగా ఉంచుకోవడం చాలా శ్రేష్ఠమైనది అని అంటారు.

29. కార్యాన్ధస్య ప్రదీపో మన్త్రః.

అ. పనుల విషయంలో గ్రుడ్డివాడికి (ఏమి చేయాలో తెలియనిస్థితిలో ఉన్నవాడికి) మంత్రమే దీపం.

30. మన్త్రిచక్షుషా పరచ్ఛిద్రాణ్యవలోకయన్తి.

అ. మంత్రం అనే నేత్రంతో శత్రువుల లోపాన్ని చూస్తారు.

31. మన్త్రకాలే న మత్సరః కర్తవ్యః.

అ. ఆలోచన చేసేటప్పుడు మత్సరం (ఒకరు చెప్పినది నేను వినడమా అన్న అహంకారం) పనికిరాదు.

32. కార్యాకార్యతత్త్వార్థదర్శినో మన్త్రిణః.

అ. ఏది చేయ్యాలి, ఏది చేయకూడదు అనే విషయాన్ని బాగా తెలుసుకో గలిగిన వాళ్ళే నిజమైన మంత్రులు.

33. షట్కర్ణాద్భిద్యతే మన్త్రః.

అ. ఇద్దరు చేసిన ఆలోచన మూడోవాడికి తెలిసిందా రహస్యం అంతా బట్టబైలైనట్లే.

34. త్రయాణామేకవాక్యే ఏవాసంప్రత్యయః.

అ. ముగ్గురు కలిస్తే వాళ్లు ఒకేమాటమీద ఉంటారనేదే నమ్మజాలని విషయం. అలాంటప్పుడు ఇద్దరు చేసిన మంతనాలు మూడోవాడికి తెలిస్తే దాగుతాయా?

[రాజ్యపాలనం బాగా నడవాలంటే మిత్రుల్ని సంపాదించాలి]

35. ఆపత్సు స్నేహసంయుక్తం మిత్రమ్.

అ. ఆపదలలో కూడా స్నేహంగా ఉన్నవాడే మిత్రుడు.

36. మిత్రసంగ్రహేణ బలం సంపద్యతే.

అ. మిత్రుల్ని సంపాదించడం చేత బలం చేకూరుతుంది.

37. బలవానలబ్ధలాభే ప్రయతతే.

అ. బలంకలవాడు ఇంతకు ముందు లభించినదానిని పొందడంకోసం ప్రయత్నిస్తాడు.

38. అలబ్ధలాభో నాలసస్య.

అ. సోమరికి అలబ్ధం (ఇదివరలో లేనిది) లభించదు.

39. అలసేన లబ్ధమపి రక్షితుం న శక్యతే.

అ. సోమరి దొరికినదాన్ని కూడా రక్షించుకోలేడు.

40. న చాలసస్య రక్షితం వివర్ధతే.

అ. సోమరి రక్షించుకొన్నది కూడా వృద్ధిపొందదు.

41. నాసౌ భృత్యాన్ పోషయతి; న తీర్థం ప్రతిపాదయతి చ.

అ. సోమరి పోష్యవర్గాన్ని పోషించడు, సత్పాత్రదానం చెయ్యడు.

42. అలబ్ధలాభాదిచతుష్టయం రాజ్యతన్త్రమ్.

అ. లేనిదాన్ని సంపాదించడం, సంపాదించినదాన్ని రక్షించుకోవడం, దాన్ని వృద్ధిపొందించుకోవడం, తగిన రీతిలో వినియోగించడం- ఈ నాలుగే రాజ్యతంత్రం (రాజ్యవ్యవహారం) అంటే.

[నీతిశాస్త్రప్రయోజనం, రాజు, శత్రువు, మిత్రులు]

43. తచ్చ రాజ్యతన్త్రమాయత్తం నీతిశాస్త్రేషు.

అ. రాజ్యతంత్రం అంతా నీతిశాస్త్రంమీద ఆధారపడి ఉంటుంది.

44. రాజ్యతన్త్రేష్వాయత్తౌ తన్త్రావాపౌ.

అ. తంత్రవాపాలు రెండూ రాజ్యతంత్రంమీద ఆధారపడి ఉంటాయి. తన రాష్ట్రంలో జరిగే వ్యవహారం తంత్రం. పరరాష్ట్రంలో జరిగేది ఆవాపం.

45. తన్త్రం స్వవిషయకృత్యేష్వాయత్తమ్.

అ. తన రాజ్యానికి సంబంధించిన వ్యవహారాలకు సంబంధించినది తంత్రం.

46. ఆవాపో మణ్డలనివిష్టః.

అ. ఇతర రాజ్యాలకు సంబంధించినది ఆవాపం.

47. సన్ధివిగ్రహయోనిర్మణ్డలః.

అ. సంధికి గాని విగ్రహానికి గాని కారణమైనది "మండలం".

48. నీతిశాస్త్రానుగో రాజా.

అ. నీతిశాస్త్రాన్ని అనుసరించేవాడే రాజు.

49. అనన్తరప్రకృతిః శత్రుః.

అ. సరిహద్దురాజ్యం రాజు శత్రువు.

50. ఏకాన్తరితం మిత్రమిష్యతే.

అ. మధ్య ఒక రాజ్యం అడ్డున్న రాజ్యానికి రాజైనవాడు మిత్రుడు. వీళ్ళిద్దరూ సహజ శత్రుమిత్రులు.

51. హేతుతః శత్రుమిత్రే భవిష్యతః.

అ. ఏదో ఒక కారణాన్ని పట్టి కూడా శత్రువులు, మిత్రులూ అవుతూంటారు.

[షాడ్గుణ్యం]

52. హీయమానః సంధిం కుర్వీత.

అ. బలం తగ్గిపోతున్నవాడు సంధి చేసుకోవాలి. బలం పూర్తిగా తగ్గిపోయిన తరవాత కాదు.

53. తేజో హి సంధానహేతుస్తదర్థానామ్.

అ. సంధివల్ల ప్రయోజనం పొందాలనుకొనేవాళ్ళకి సంధి కుదరాలంటే రెండు పక్షాలవాళ్ళకీ తేజస్సు (బలం) ఉండాలి.

54. నాతప్తలోహో లోహేన సంధీయతే.

అ. కాల్చకుండా లోహం లోహంతో అతకదు.

55. బలవాన్ హీనేన విగృహ్ణీయాత్, న జ్యాయసా సమేన వా.

అ. బలంగా ఉన్నవాడు తనకంటె తక్కువ బలం ఉన్నవాడితో విరోధం పెట్టుకోవాలి; తనకంటె ఎక్కువ బలం ఉన్నవాడితో గాని, సమునితో గాని విరోధం పెట్టుకోకూడదు.

56. గజేన పాదయుద్ధమివ బలవద్విగ్రహః; ఆమపాత్రమపాత్రేమేన వినశ్యతి.

అ. బలవంతునితో యుద్ధం పెట్టుకోవడం కాలిబంటు ఏనుగుతో యుద్ధం చేయడం వంటిది. పచ్చికుండ పచ్చికుండతో ఢీకొన్నా కూడా బద్దలైపోతుంది. (గట్టి వస్తువుతో ఢీకొంటే ఇంకా చెప్పాలా?)

ఒక పాఠం ప్రకారం ఇవి రెండు సూత్రాలు. బలవంతునితో యుద్ధం ఏనుగుతో యుద్ధం చేయడంవంటిది అని మొదటి సూత్రానికి అర్థం. సముడితో కూడా విరోధం పెట్టుకోకూడదు. రెండు పచ్చికుండలు ఢీకొన్నా రెండింటికీ ప్రమాదమే అని రెండవ సూత్రం భావం.

57. అరిప్రయత్నమభిసమీక్షేత.

అ. శత్రువు చేస్తున్న ప్రయత్నాలు ఒక కంట కనిపెడుతూ ఉండాలి.

58. సంధాయైకతో వా యాయాత్.

అ. చాలామంది శత్రువులున్నప్పుడు ఒకరితో సంధి చేసికొని రెండవవాని మీదికి యుద్ధానికి వెళ్ళాలి.

"సంధాయైకతో వా" అని మాత్రమే ఒక పాఠం. చాలామంది శత్రువులున్నప్పుడు ఒకరితోనైనా సంధిచేసుకొని ఉండాలి అని అర్థం చెప్పాలి. కాని "యాయాత్" అనేది లేని పక్షంతో "సంధాయ" అని ల్యబంతప్రయోగం ("సంధి చేసుకొని" అను అసమాపకక్రియ) కుదరదు.

59. అమిత్రవిరోధాదాత్మరక్షామావసేత్

అ. శత్రువులతో విరోధం వల్ల అనగా శత్రువులు విరోధం చూపుతున్నప్పుడు ఆత్మరక్షణ చేసికోవాలి. లేదా శత్రువులతో విరోధంకంటె ఆత్మరక్షణకు ఏర్పాట్లు చేసుకోవడం మంచిది అని అర్థం.

60. శక్తిహీనో బలవన్తమాశ్రయేత్.

అ. శక్తి లేనివాడు బలవంతుణ్ణి ఆశ్రయించాలి.

61. దుర్బలాశ్రయో దుఃఖమావహతి.

అ. దుర్బలుణ్ణి ఆశ్రయిస్తే లేని కష్టాలు తెచ్చిపెట్టుకున్నట్లు అవుతుంది.

62. అగ్నివద్రాజానమాశ్రయేత్.

అ. రాజును అగ్నిని ఆశ్రయించినట్లు ఆశ్రయించాలి. అగ్నితో వ్యవహరించినట్లు వ్యవహరించాలి.

63. రాజ్ఞః ప్రతికూలం నాచరేత్.

అ. ఆశ్రయించిన రాజుకు ప్రతికూలంగా ప్రవర్తించకూడదు.

64. ఉద్ధతవేషధరో న భవేత్.

అ. ఆ రాజు ఎదుట ఆడంబరపూర్వకమైన వేషం ధరించకూడదు.

65. న దేవచరితం చరితం చరేత్.

అ. దేవతలు ప్రవర్తించినట్లు ప్రవర్తించకూడదు. శ్రీరామకృష్ణాదులూ రాజులే; నేనూ రాజునే అన్నట్లు ప్రవర్తించకూడదు.

66. ద్వయోరపీర్ష్యతోః ద్వైధీభావం కుర్వీత.

అ. ఇద్దరు తనతో విరోధం పెట్టుకొన్నప్పుడు ద్వైదీభావం చెయ్యాలి. అనగా ఒకరితో సంధిచేసుకొని రెండవవానితో విరోధం సాగించాలి.

[దుర్వ్యసనాదుల దుష్పరిణామాలు]

67. న వ్యసనపరస్య కార్యావాప్తిః.

అ. దుర్వ్యసనాలకి లొంగిపోయినవారికి ఏ పనీ జరగదు.

68. ఇన్ద్రియవశవర్తీ చతురఙ్గవానపి వినశ్యతి.

అ. ఇంద్రియాలకి లొంగిపోయినవాడు చతురంగబలం ఉన్నా నశిస్తాడు. గజ-తురగ-రథ-పదాతు లనే చతురంగబలం అనాడు. వాయుసేనా-జలసేనా- యుద్ధశకట- పదాతు లనే చతురంగబలం ఈనాడు.

69. నాస్తి కార్యం ద్యూతప్రవృత్తస్య.
అ. ద్యూత (జూదం) వ్యసనంలో పడ్డవారు ఏ పనీ సాధించలేరు.

70. మృగయాపరస్య ధర్మార్థౌ నశ్యతః.
అ. వేట వ్యసనం ఉన్నవాని ధర్మం, అర్థం కూడా నశిస్తాయి.

71. న కామాసక్తస్య కార్యానుష్ఠానమ్.
అ. కామాసక్తుడు ఏ పనీ చేయలేడు.

72. అర్థేషణా న వ్యసనేషు గణ్యతే.
అ. రాజుకు ధనాసక్తి ఉండడం వ్యసనంగా పరిగణించబడదు.

73. అర్థతోషిణం హి రాజానం శ్రీః పరిత్యజతి.
అ. ఉన్న ధనం చాలునులే అనుకొనే రాజును లక్ష్మి విడిచివేస్తుంది.

74. అగ్నిదాహాదపి విశిష్టం పురుషవాక్యమ్.
అ. వాక్పారుష్యం నిప్పు వేడికంటే కూడా అధికమైనది.

75. దణ్డపారుష్యాత్ సర్వజనద్వేష్యో భవతి.
అ. దండం (శిక్షించడం)లో పరుషంగా ఉండే అందరికీ ద్వేషపాత్రుడౌతాడు.

76. అమిత్రో దణ్డనీత్యామాయత్తః.
అ. శత్రువు దండనీతికి లొంగుతాడు. దండం అనగా అపరాధుల్ని శిక్షించడం, రాజ్యాన్ని పాలించడం, (దండనీతి అనగా 'రాజనీతి' పాలనారీతి అని అర్థం

77. దణ్డనీతిమధితిష్ఠన్ ప్రజాః సంరక్షతి.
అ. దండనీతి అవలంబించినవాడే ప్రజల్ని రక్షించగలుగుతాడు.

78. దణ్డః సంపదా యోజయతి.
అ. దండం సంపదను సంపాదించిపెడుతుంది.

79. దణ్డాభావే త్రివర్గాభావః.
అ. దండం అనేది లేకపోతే త్రివర్గమే (ధర్మ-అర్థ-కామాలే) లేదు.

80. న దణ్డాదకార్యాణి కుర్వన్తి.

అ. దండం ఉంది కాబట్టే చెడ్డపనులు చెయ్యరు.

81. దణ్డనీత్యామాయత్తమాత్మరక్షణమ్.

అ. ఆత్మరక్షణం దండనీతిమీద ఆధారపడి ఉంటుంది.

82. ఆత్మని రక్షితే సర్వం రక్షితం భవతి.

అ. తనని తాను రక్షించుకొంటే అన్నీ రక్షించినట్లే.

83. ఆత్మాయత్తౌ వృద్ధివినాశౌ.

అ. అభివృద్ధైనా వినాశనమైనా తన చేతుల్లో ఉంటుంది.

84. దణ్డో హి విజ్ఞానేన ప్రణీయతే.

అ. దండాన్ని వివేకపూర్వంగా ప్రయోగించాలి.

85. దుర్బలోఽపి రాజా నావమన్తవ్యః.

అ. దుర్బలుడైనా రాజును అవమానించకూడదు.

86. నాస్త్యగ్నేర్దౌర్బల్యమ్.

అ. అగ్నికి దుర్బలత్వం అనేది ఉండదు

87. దణ్డే ప్రణీయతే వృత్తిః.

అ. దండం ఉంటేనే వృత్తులు (జీవనోపాయాలు) సాగుతాయి.

88. వృత్తిమూలమర్థలాభః.

అ. వృత్తికి మూలం ధనలాభం. ధనలాభం ఉంటేనే ఎవరైనా ఆ వృత్తి చేపడతారు.

89. అర్థమూలౌ ధర్మకామౌ.

అ. ధర్మ-కామాలకి మూలకారణం అర్థమే.

(ప్రథమాధ్యాయం సమాప్తం.)

# రెండవ అధ్యాయము

[ఇష్టమైన ఆ యా కార్యాలు సాధించే ఉపాయాలు]

1. అర్థమూలం సర్వం కార్యమ్; యదల్పప్రయత్నాత్ కార్యం భవతి.

అ. ఏ పనులు జరగాలన్నా మూలం ధనం. ఎందుచేతనంటే ధనం ఉన్న వాడు స్వల్పప్రయత్నంతోనే కార్యం సాధిస్తాడు.

2. ఉపాయపూర్వం కార్యం న దుష్కరం స్యాత్.

అ. ఉపాయంతో చేసే పనిలో శ్రమ ఉండదు.

3. అనుపాయపూర్వం కృతమపి వినశ్యతి.

అ. ఉపాయం లేకుండా చేసిన పని జరిగినా కూడా చెడిపోతుంది.

4. కార్యార్థినాముపాయ ఏవ సహాయః.

అ. పనులు తలపెట్టినవారికి నిజమైన సహాయం ఉపాయమే.

5. కార్యం పురుషకారేణ లక్ష్యం సంపద్యతే.

అ. పురుషప్రయత్నం సరిగా చేస్తే కార్యస్వరూపం స్పష్టంగా కనబడుతుంది. అప్పుడు దాన్ని సాధించవచ్చు.

6. పురుషకారమనువర్తతే దైవమ్.

అ. దైవం పురుషప్రయత్నాన్ని అనుసరించి ఉంటుంది. అనగా పురుష ప్రయత్నం చేస్తే దైవం కూడా దానంతట అదే తోడ్పడుతుంది.

7. దైవం వినాతిప్రయత్నం కరోతి తద్విఫలమ్.

అ. దైవం పూర్తిగా ప్రతికూలంగా ఉన్నప్పుడు ఎంత ప్రయత్నం చేసినా అది వ్యర్థమే అవుతుంది.

8. అసమాహితస్య కార్యం న విద్యతే.

అ. బుద్ధి నిలకడలేనివానికి పనులేమిటి?

9. పూర్వం నిశ్చిత్య పశ్చాత్కార్యమారభేత.

అ. ఏది ఎలా చెయ్యాలో ముందు నిశ్చయించుకొని తరవాత ఆ పని ప్రారంభించాలి.

10. కార్యాన్తరే దీర్ఘసూత్రతా న కర్తవ్యా.

అ. పని ప్రారంభించిన తరవాత మధ్యలో తెగతెంపులు లేని ఆలోచనలు చెయ్యకూడదు.

11. న చలచిత్తస్య కార్యావాప్తిః.

అ. చపలచిత్తుడు ఏ పనీ చేయలేడు.

12. హస్తగతావమాననాత్ కార్యవ్యతిక్రమో భవతి.

అ. చేతిలో ఉన్నదాన్ని చిన్నచూపు చూస్తే పని చెడుతుంది.

13. దోషవర్జితాని కార్యాణి దుర్లభాని.

అ. దోషాలు లేని కార్యాలంటూ ఉండవు.

14. దురనుబన్ధం కార్యం నారభేత.

అ. చెడుగా పరిణమించే పని ప్రారంభించకూడదు.

15. కాలవిత్ కార్యం సాధయేత్.

అ. సమయాసమయాలు తెలిసినవాడు కార్యం సాధించగలుగుతాడు.

16. కాలాతిక్రమాత్ కాల ఏవ ఫలం పిబతి.

అ. సమయం దాటబెడితే కాలమే ఫలాన్ని మింగేస్తుంది.

17. క్షణం ప్రతి 'కాలవిక్షేపం న కుర్యాత్ సర్వకార్యేషు.

అ. ఏ పనివిషయంలోనూ కూడా ఒక క్షణమైనా ఆలస్యం చెయ్యకూడదు.

18. దేశకాలవిభాగౌ జ్ఞాత్వా కార్యమారభేత.

అ. ఏ దేశంలో ఏ కాలంలో ఏమి చెయ్యాలో తెలుసుకొని పని ప్రారంభించాలి.

19. దైవహీనం కార్యం సుసాధ్యమపి దుస్సాధ్యం భవతి.

అ. సులభంగా జరగవలసిన పనికూడా దైవం ప్రతికూలంగా ఉంటే కష్టపడి సాధించవలసి ఉంటుంది.

20. నీతిజ్ఞో దేశకాలౌ పరీక్షేత.

అ. నీతి తెలిసినవాడు దేశాన్నీ, కాలాన్నీ జాగ్రత్తగా పరీక్షించుకోవాలి.

21. పరీక్ష్యకారిణి శ్రీశ్చిరం తిష్ఠతి.

అ. ఏ పనైనా పరీక్షించి చేసేవాడి దగ్గర లక్ష్మి చాలా కాలం ఉంటుంది.

22. సర్వాశ్చ సంపదః సర్వోపాయేన పరిగృహ్ణీయాత్.

అ. అన్ని ఉపాయాలూ ప్రయోగించి అన్ని సంపదలూ సమకూర్చుకోవాలి.

23. భాగ్యవన్తమప్యపరీక్షకారిణం శ్రీః పరిత్యజతి.

అ. పరీక్షించకుండా పనులు చేసేవాడు ఎంత అదృష్టవంతుడైనా వాణ్ణి లక్ష్మి విడిచివేస్తుంది.

24. జ్ఞాత్వా అనుమానైశ్చ పరీక్షా కర్తవ్యా.

అ. విషయం బాగా తెలుసుకొని ఊహించుకొని పరీక్ష చెయ్యాలి.

25. యో యస్మిన్ కర్మణి కుశలస్తం తస్మిన్నేవ యోజయేత్.

అ. ఎవడికి ఏ పనిలో నేర్పు ఉందో వాణ్ణి ఆ పనిలోనే నియమించాలి.

26. దుఃసాధమపి సుసాధం కరోత్యుపాయజ్ఞః.

అ. ఉపాయం తెలిసినవాడు కష్టమైన పనికూడ సులువుగా చేసేస్తాడు.

27. అజ్ఞానినా కృతమపి నబహుమన్తవ్యమ్; యాదృచ్ఛికత్వాత్.

అ. తెలివితక్కువవాడు ఏ పనైనా సాధించినా వాణ్ణి మెచ్చుకోకూడదు. ఎందుచేతనంటే అతడా పని యాదృచ్ఛికంగా (just by accident) చేసుగలిగాడు.

28. కృమయోఽపి హి కదాచిద్రూపాన్తరాణి కుర్వన్తి.

అ. పురుగులు కూడా కట్టు దొలిచి కొన్ని ఆకారాలు తయారుచేస్తాయి కదా.

29. సిద్ధస్యైవ కార్యస్య ప్రకాశనం కర్తవ్యమ్.

అ. పని జరిగిన తరువాతనే బైట చెప్పాలి.

30. జ్ఞానవతామపి దైవమానుషదోషాత్ కార్యాణి దుష్యన్తి.

అ. ఎంత తెలివైనవాళ్ళ పనులైనా దైవదోషంచేత, మానవదోషంచేతా చెడిపోతూంటాయి.

31. దైవం దోషం శాన్తికర్మణా వినివారయేత్.

అ. దైవదోషాన్ని శాంతికర్మలు చేసి నివారించుకోవాలి.

32. మానుషీం కార్యవిపత్తిం కౌశలేన వినివారయేత్.

అ. మనుష్యులవల్ల కలిగే కార్యవిఘాతాన్ని నేర్పుతో తప్పించుకోవాలి.

33. కార్యవిపత్తౌ దోషాన్ వర్ణయన్తి బాలిశాః.

అ. పనులు చెడిపోతే మందబుద్ధులు తమ ప్రయత్నలోపం అని చెప్పకుండా ఏవేవో దోషాలు వర్ణించి చెపుతారు.

34. కార్యార్థినా దాక్షిణ్యం న కర్తవ్యమ్.

అ. పని కావలసినవాడు అనవసరంగా మొహమాట పడకూడదు.

35. క్షీరార్థీ వత్సః మాతురూధః ప్రతిహన్తి.

అ. పాలు కోరే లేగదూడ తల్లి పొదుగు పొడుస్తుంది.

36. అప్రయత్నాత్ కార్యవిపత్తిర్భవేత్.

అ. సరిగా ప్రయత్నం చేయకపోతే కార్యం చెడిపోతుంది.

37. న దైవమాత్రప్రమాణానాం కార్యసిద్ధిః.

అ. అంతకీ దైవమే ఉన్నదనుకొనేవాళ్ళ పనులు జరగవు.

38. కార్యబాహ్యో న పోషయత్యాశ్రితాన్.

అ. ఏ పనులూ చేయలేనివాడు పోషించతగిన వాళ్ళని పోషించజాలడు.

39. యః కార్యం న పశ్యతి సోఽన్ధః.

అ. కార్యాన్ని గుర్తించనివాడే గ్రుడ్డివాడు.

40. ప్రత్యక్షపరోక్షానుమానైః కార్యం పరీక్షేత.

అ. ప్రత్యక్షంగా చూచి, పరోక్షంగా ఇతరులవల్ల విని, తాను ఊహించు కొని కార్యాన్ని పరీక్షించాలి.

41. అపరీక్ష్యకారిణం శ్రీః పరిత్యజతి.

అ. పరీక్షించకుండా పనులు చేసేవాణ్ణి లక్ష్మి త్యజిస్తుంది.

42. పరీక్ష్య తార్యా విపత్తిః.

అ. ఆపద వచ్చినప్పుడు బాగా పరీక్షించి దాన్ని దాటాలి.

43. స్వశక్తిం జ్ఞాత్వా కార్యమారభేత.

అ. తనకి ఎంత శక్తి ఉందో తెలిసికొని ప్రారంభించాలి.

44. స్వజనం తర్పయిత్వా యః శేషభోజీ సోఽమృతభోజీ.

అ. తనవాళ్ళ కందరికీ తృప్తి కలిగించి మిగిలినది భుజించేవాడు అమృత భోజి (అమృతం తినేవాడు).

45. సమ్యగనుష్ఠానాదాయముఖాని వర్ధన్తే.

అ. పనులు సక్రమంగా నిర్వహించడంవల్ల రాబడికి దారులు పెరుగు తాయి.

46. నాస్తి భీరోః కార్యచిన్తా.

అ. పిరికివాడు ఏ కార్యాన్ని గూర్చి ఆలోచించజాలడు.

47. స్వామినః శీలం జ్ఞాత్వా కార్యార్థీ కార్యం సాధయేత్.

అ. పని కావలసినవాడు ప్రభువు స్వభావం ఎలాంటిదో తెలిసికొని తన పని సాధించుకోవాలి.

48. ధేనోః శీలజ్ఞో హి క్షీరం భుఙ్క్తే.

అ. ఆవు స్వభావం తెలిసినవాడే దాని పాలు త్రాగగలుగుతాడు కదా.

49. క్షుద్రే గుహ్యప్రకాశనమాత్మవాన్ న కుర్యాత్.

అ. తెలివైనవాడు నీచబుద్ధికి రహస్యవిషయాలు చెప్పకూడదు.

50. ఆశ్రితైరప్యవమన్యతే మృదుస్వభావః.

అ. మెత్తటివాణ్ణి ఆశ్రితులు కూడా అవమానిస్తారు.

51. తీక్ష్ణదణ్డః సర్వేషాముద్వేజనీయో భవతి.

అ. తీక్షంగా శిక్షించేవాణ్ణి అందరూ ఏవగించుకొంటారు.

52. యథార్హదణ్డకారీ స్యాత్.

అ. తగువిధంగానే శిక్ష విధించాలి.

53. అల్పసారం శ్రుతవన్తమపి న బహుమన్యతే లోకః.

అ. ఎంత చదువుకొన్నవాడైనా శక్తి లేనివాణ్ణి లోకం గౌరవించదు.

54. అతిభారః పురుషమవసాదయతి.

అ. ఎక్కువ బరువు (కార్యభారం) మనిషిని క్రుంగదీసివేస్తుంది.

55. యః సంసది పరదోషం శంసతి స స్వదోషబహుత్వమేవ ప్రఖ్యాపయతి.

అ. సభలో (పదిమందిలో) ఇతరుల దోషాలను గూర్చి చెప్పేవాడు తనలో ఉన్న ఎన్నో దోషాలను చాటి చెప్పుకున్నవాడవుతాడు.

56. ఆత్మానమేవ నాశయత్యనాత్మవతాం కోపః.

అ. తనను తాను అదుపులో ఉంచుకొనలేనివాని కోపం తననే నశింపచేస్తుంది.

57. నాస్త్యప్రాప్తం సత్యవతామ్.

అ. సత్యమే పలికేవాళ్ళకి లభ్యం కానిదంటూ ఉండదు.

58. న కేవలేన సాహసేన కార్యసిద్ధిర్భవతి.

అ. సాహసం చేత మాత్రమే పనులు జరగవు.

59. వ్యసనార్తో విస్మరత్యవశ్యకర్తవ్యాన్.
అ. వ్యసనాలలో చిక్కుకొన్నవాడు తప్పకుండా చేయవలసిన పనులు మరిచిపోతాడు.

60. నాస్త్యనన్తరాయః కాలవిక్షేపే.
అ. కాలవిక్షేపం (Post Ponement) చేస్తూ పోతే (తరవాత చేద్దాంలే అని అనుకుంటూ పోతే) పనికి విఘ్నాలు కలగకపోవడం ఉండదు.

61. అసంశయవినాశాత్ సంశయవినాశః శ్రేయాన్.
ఆ. నిస్సంశయమైన వినాశం కంటె సంశయవినాశం మేలు. ఏమీ చేయకుండా కూర్చుంటే వినాశం తప్పదనే పరిస్థితికంటె ప్రతి క్రియ చేస్తే వినాశం తప్పుతుందేమో అన్న సందిగ్ధస్థితి మంచిది.

[సామాన్య నీతులు]

62. కేవలం ధనాని నిక్షేప్తుః న స్వార్థం, న దానం, న ధర్మః.
అ. కేవలం ధనాన్ని కూడబెట్టేవానికి దానివల్ల తన కేమీ ప్రయోజనం లేదు, దానమూ లేదు, ధర్మమూ లేదు. శ్రమ మాత్రం మిగులుతుంది.

63. నార్యా ఆగతోఽర్థః తద్విపరీత మనర్థభావం భజతే.
అ. స్త్రీద్వారా వచ్చిన అర్థం (ధనం) దానికి విపరీతంగా 'అనర్థం' (అపకారహేతువు) అవుతుంది.

64. యో ధర్మార్థౌ న వ్యర్థయతి స కామః. తద్విపరీతోఽనర్థసేవీ.
అ. ధర్మార్థాలకి లోపం కలిగించనిదే కామం. వాటికి లోపం కలిగించే విధంగా కామాన్ని సేవించేవాడు అనర్థాన్నే సేవిస్తున్నట్లు.

65. ఋజుస్వభావపరో జనో దుర్లభః.
అ. కపటం లేని స్వభావంలో ఆసక్తి గల (కపటం లేని) మనిషి దొరకడం కష్టం.

66. అవమానేనాగతమైశ్వర్యమవమన్యత ఏవ సాధుః.

అ. సత్పురుషుడు అవమానపూర్వకంగా వచ్చిన ఐశ్వర్యాన్ని అవమానిస్తాడు. దానిని స్వీకరించడు.

67. బహూనపి గుణాన్ ఏకదోషో గ్రసతి.

అ. ఒక్క దోషం గుణాల నన్నింటినీ మింగేస్తుంది.

68. మహాత్మనా పరేణ సాహసం న కర్తవ్యమ్.

అ. మహాత్ముడైన శత్రువు విషయంలో సాహసకృత్యానికి (యుద్ధాదులకి) దిగకూడదు.

69. కదాచిదపి చారిత్రం న లఙ్ఘయేత్.

అ. మంచి నడవడికను ఏనాడూ విడువకూడదు.

70. క్షుదార్తో న తృణం చరతి సింహః.

అ. ఆకలితో బాధపడుతూన్నా సింహం గడ్డి మేయదు.

71. ప్రాణాదపి ప్రత్యయో రక్షితవ్యః.

అ. ప్రాణాలకంటె కూడా ఎక్కువగా జనవిశ్వాసాన్ని రక్షించుకోవాలి.

72. పిశునో నేతా పుత్రదారైరపి త్యజ్యతే.

అ. చాడీలు చెప్పే నాయకుణ్ణి భార్యాపుత్రాదులు కూడా విడిచివేస్తారు.

ద్వితీయాధ్యాయం సమాప్తం.

# తృతీయాధ్యాయం

[సర్వసాధారణ నీతులు]

1. బాలాదపి యుక్తమర్థం శృణుయాత్.

అ. మంచి విషయం చిన్న పిల్లవాడు చెప్పినా వినాలి.

2. సత్యమప్యశ్రద్ధేయం న వదేత్.

అ. నిజమే అయినా వినేవాళ్ళు నమ్మడానికి శక్యం కాని విషయం చెప్ప కూడదు. ఉదా: తానేదైనా ఘనమైన కార్యం సాధించినా వినేవాళ్ళు నమ్మరనే సందేహం ఉన్నప్పుడు అది వాళ్ళకి చెప్పకపోవడమే మంచిది.

3. నాల్పదోషాద్బహుగుణా స్త్యజ్యన్తే.

అ. చాలా గుణాలు ఉన్నవాళ్ళని ఉన్న వస్తువులను) ఏదో ఒక చిన్న దోషం ఉన్నంత మాత్రాన విడిచి పెట్టకూడదు.

4. విపశ్చిత్స్వపి సులభా దోషాః.

అ. మహాపండితులలో కూడా ఏవో కొన్ని లోపాలు ఉండవచ్చు.

5. నాస్తి రత్నమఖణ్డితమ్.

అ. ఖండించని రత్నం ఉండదు. (ఎంతటి వాళ్ళకైనా కొన్ని కష్టాలు లేదా లోపాలు తప్పవు.)

6. మర్యాదాతీతం న కదాచిదపి విశ్వసేత్.

అ. అవధులు దాటిన విషయం ఎన్నడూ నమ్మకూడదు. కొన్ని అవధులు మించి నమ్మకూడదు. లేదా మర్యాద లేనివానిని ఎన్నడూ నమ్మకూడదు.

7. అప్రియే కృతం ప్రియమపి ద్వేష్యం భవతి.

అ. అప్రియుడికి ఏదైనా ప్రియమైనది చేసినా దాన్ని అతడు ద్వేషిస్తాడు.

8. నమస్త్యపి తులాకోటిః కూపోదకక్షయం కరోతి.

అ. ఘటీయంత్రానికి (బావిలోనుంచి) నీళ్ళు తోడడానికి కుండలు కట్టిన చక్రానికి) సంబంధించిన చివరి భాగం వంగుతున్నా నూతిలోని నీళ్ళన్నీ తోడేస్తుంది.

9. సతాం మతం నాతిక్రామేత్.

అ. సత్పురుషుల అభిప్రాయం కాదనకూడదు.

10. గుణవదాశ్రయాన్నిర్గుణోఽపి గుణీ భవతి.

అ. గుణవంతుణ్ణి ఆశ్రయించడంవల్ల గుణవిహీనుడు కూడా గుణవంతు డౌతాడు.

11. క్షీరాశ్రితం జలం క్షీరమేవ భవతి.

ఆ. పాలను ఆశ్రయించిన నీరు పాలే అయిపోతుంది.

12. మృత్పిణ్డేఽపి పాటలిపుష్పం స్వగన్ధముత్పాదయతి.

అ. పాటలిపుష్పం మట్టిముద్దలోనికి కూడ తన సువాసనను సంక్రమింప చేస్తుంది.

13. రజతం కనకసంగాత్ కనకం భవతి.

అ. బంగారంతో కలిసిన వెండి కూడా బంగారం అవుతుంది.

14. ఉపకర్తర్యపకర్తు మిచ్ఛత్యబుధః.

అ. తెలివితక్కువవాడు ఉపకారం చేసినవాడికి కూడా అపకారం చెయ్యాలని అనుకొంటాడు.

15. న పాపకర్మణామాక్రోశభయమ్.

అ. పాపం పనులు చేసేవాళ్ళకి ఇతరులు తిడతా రనే భయం ఉండదు.

16. ఉత్సాహవతాం శత్రవోఽపి వశీభవన్తి.

అ. ఉత్సాహవంతులకి శత్రువులు కూడా వశం అవుతారు.

17. విక్రమధనా హి రాజానః.

అ. రాజులకి పరాక్రమమే ధనం.

18. నాస్త్యలసస్య ఐహికమాముష్మికం వా.

అ. సోమరికి ఐహికమూ లేదు, పారలౌకికమూ లేదు.

19. నిరుత్సాహాద్దైవం పతతి.

అ. నిరుత్సాహపడితే దైవం కూడా వ్యతిరేకిస్తుంది.

20. మత్స్యార్థీవ జాలముపయుజ్యార్థం గృహ్ణీయాత్.

అ. చేపలు పట్టేవాడు వలె వల పన్ని ధనం సంపాదించాలి.

21. అవిశ్వస్తేషు విశ్వాసో న కర్తవ్యః.

అ. తన మీద నమ్మకం లేనివాళ్ళని నమ్మకూడదు.

22. విషం విషమేవ సర్వకాలమ్.

అ. విషం ఏనాటికీ విషమే.

23. అర్థసమాదానే వైరిణాం సంగ ఏవ న కర్తవ్యః.

అ. ధనం సేకరించేటప్పుడు శత్రువులతో సంబంధమే పెట్టుకోకూడదు.

24. అర్థసిద్ధౌ వైరిణం న విశ్వసేత్.

అ. కార్యసిద్ధి విషయంలో శత్రువును నమ్మకూడదు.

25. అర్థాధీన ఏవ నియతసంబన్ధః.

అ. ఇద్దరి మధ్య ఒక నిశ్చితమైన సంబంధం ఉన్నదంటే అది ఏదో ఒక ప్రయోజనం మూలాన్నే ఏర్పడుతుంది.

26. శత్రోరపి సుతః సఖా రక్షితవ్యః.

అ. శత్రువు కుమారుడైనా స్నేహితుడైతే వాణ్ణి రక్షించాలి.

27. యావచ్ఛత్రోశ్ఛిద్రం పశ్యతి తావద్ధస్తేన వా స్కన్దేన వా సంవాహ్యః; ఛిద్రే తు ప్రహరేత్.

అ. శత్రువులో ఉన్న లోపం (దౌర్బల్యం Weak Point) కనబడే వరకు వాణ్ణి చేతులమీద కాని, భుజాలమీద కాని మొయ్యాలి. లోపం కనబడగానే వాడిమీద దెబ్బతీయాలి.

28. ఆత్మచ్ఛిద్రం న ప్రకాశయేత్.

అ. తన లోపాలను బైట పడనీయకూడదు.

29. ఛిద్రప్రహారిణః శత్రవోఽపి.

అ. శత్రువులు కూడా ఏవో లోపాలు కనబడినప్పుడే దెబ్బతీస్తారు.

30. హస్తగతమపి శత్రుం న విశ్వసేత్.

అ. చేతికి చిక్కినా కూడా శత్రువును నమ్మకూడదు.

31. స్వజనస్య దుర్వృత్తిం వారయేత్.

అ. తన వాళ్ళల్లో ఉన్న చెడ్డ నడవడికను నివారించాలి.

32. స్వజనావమానోఽపి మనస్వినాం దుఃఖమావహతి.

అ. తనవాళ్ళకి అవమానం జరిగినా ఆత్మాభిమానవంతులు బాధపడతారు.

33. ఏకాఙ్గదోషః పురుషమవసాదయతి.

అ. ఒక్క అవయవంలో ఉన్న దోషం కూడా మనిషిని క్రుంగ దీస్తుంది.

34. శత్రుం జయతి సువృత్తతా.

అ. సచ్చరిత్ర (మంచి నడవడిక) శత్రువును జయిస్తుంది-శత్రువుల నుండి కూడా మెప్పు తెస్తుంది.

35. నికృతిప్రియా నీచాః.

అ. అపకారం చేయడమే నీచులకు ఇష్టం.

36. నీచస్య మతిర్న దాతవ్యా.

అ. నీచుడికి సలహాలు ఇవ్వకూడదు.

37. నీచేషు విశ్వాసో న కర్తవ్యః.

అ. నీచుల్ని నమ్మకూడదు.

38. సుపూజితోఽపి దుర్జనః పీడయత్యేవ.

అ. దుర్జనుణ్ణి ఎంత గౌరవించినా పీడించడం మానడు.

39. చన్దనాదీనపి దావోఽగ్నిర్దహత్యేవ.

అ. దవాగ్ని చందనవృక్షాదులను కూడా కాల్చియే తీరుతుంది.

40. కదాపి కమపి పురుషం నావమన్యేత.

అ. ఎప్పుడూ, ఎవర్నీ అవమానించకూడదు.

41. క్షన్తవ్యమితి పురుషం న బాధేత.

అ. క్షమించడమే యుక్తం; అందుచేత ఎవర్నీ బాధించకూడదు.

42. భర్త్రాధికం రహస్యుక్తం వక్తుమిచ్ఛన్త్యబుద్ధయః.

అ. తెలివితక్కువవాళ్ళు ప్రభువు రహస్యంగా చెప్పిన విషయాన్ని ఇంకా అదీ ఇదీ కలిపి నలుగురికీ చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటారు.

43. అనురాగస్తు ఫలేన సూచ్యతే.

అ. ఎంత అనురాగం ఉందో ఫలాన్ని పట్టి తెలుస్తుంది.

44. ఆజ్ఞాఫలమైశ్వర్యమ్.

అ. ఐశ్వర్యం ఉన్నందుకు ప్రయోజనం అధికారం చలాయించడం.

45. దాతవ్యమపి బాలిశః పరిక్లేశేన దాస్యతి.

అ. మూర్ఖుడు ఇవ్వవలిసింది కూడా ఎంతో కష్టంమీద ఇస్తాడు.

46. మహదైశ్వర్యం ప్రాప్యాపి అధృతిమాన్ వినశ్యతి.

అ. ధైర్యం లేనివాడు, లేదా చిత్తస్థైర్యం లేనివాడు గొప్ప ఐశ్వర్యం లభించినా కూడా నశిస్తాడు.

47. నాస్త్యధృతేరైహికమాముష్మికం వా.

అ. చిత్తస్థైర్యం లేనివానికి ఐహికమూ లేదు, ఆముష్మికమూ లేదు.

48. న దుర్జనైః సహ సంసర్గః కర్తవ్యః.

అ. దుర్జనుల సహవాసం చెయ్యకూడదు.

49. శౌణ్డహస్తగతం పయోఽప్యవమన్యతే జనః.

అ. కల్లు అమ్మేవాడి చేతిలో ఉన్న పాలను కూడా మనుష్యులు నిరాకరిస్తారు.

50. కార్యసంకటేష్వర్థవ్యవసాయినీ బుద్ధిః.

అ. పనులలో కష్టాలు ఏర్పడినప్పుడు విషయనిర్ధారణ చేయగలిగిందే బుద్ధి.

51. మితభోజనమ్ స్వాస్థ్యమ్.

అ. మితంగా భుజించడమే ఆరోగ్యం.

52. పథ్యమప్యపథ్యాజీర్ణే నాశ్నీయాత్.

అ. హితమైన పదార్థాన్ని కూడా తన శరీరానికి అది పథ్యం కానప్పుడు, అజీర్ణంగా ఉన్నప్పుడూ తినకూడదు. [పథ్యమపథ్యం వాఽజీర్ణే నాశ్నీయాత్" ఇది పాఠాంతరం పథ్యమైనదైనా (తన శరీరానికి హితమైనదైనా) అపథ్యమైనదైనా ఆహారాన్ని అజీర్ణంగా ఉన్నప్పుడు తినకూడదు అని దీని అర్థం]

53. జీర్ణభోజినం వ్యాధిర్నోపసర్పతి.

అ. తిన్నది జీర్ణమైన తరవాతనే మళ్ళీ భుజించేవాడి దగ్గరికి రోగాలు రావు.

54. జీర్ణశరీరే వర్ధమానం వ్యాధిం నోపేక్షేత.

అ. శరీరం జీర్ణమైన తరవాత (వార్ధక్యంలో) వచ్చిన వ్యాధిని ఉపేక్ష చేయకూడదు.

55. అజీర్ణే భోజనం దుఃఖమ్.

అ. అజీర్ణంగా ఉన్నప్పుడు భోజనం చేయడం దుఃఖహేతువు.

56. శత్రోరపి విశిష్యతే వ్యాధిః.

అ. శత్రువును కూడా మించినది వ్యాధి

57. దానం నిధానమనుగామి.

అ. దానం అనేది కూడావచ్చే నిధి.

58. పటుతరేఽపి తృష్ణాపరే సులభమతిసంధానమ్.

అ. ఎంత తెలివైనవాడైనా దురాశ కలవాణ్ణి మోసగించడం సులభం.

59. తృష్ణయా మతిశ్ఛాద్యతే.

అ. దురాశ ఆలోచనాశక్తిని కప్పివేస్తుంది.

60. కార్యబహుత్వే బహుఫలమాయతికం కుర్యాత్.

అ. చాలా కార్యాలున్నప్పుడు ఎక్కువ ఫలాన్ని ఇచ్చే పనీ, భవిష్యత్తులో లాభకరమైన పనీ చెయ్యాలి.

61. స్వయమేవావస్కన్నం కార్యం నిరీక్షేత.

అ. చెడిపోయిన పనిని తానే చక్కదిద్దుకోవాలి. లేదా తానే పని చెడిపోకుండా చక్కదిద్దుకోవాలి.

62. మూర్ఖేషు సాహసం నియతమ్.

అ. మూర్ఖులలో సాహసం తప్పకుండా ఉంటుంది.

63. మూర్ఖేషు వివాదో న కర్తవ్యః.

అ. మూర్ఖులతో వాగ్వాదం పెట్టుకోకూడదు.

64. మూర్ఖేషు మూర్ఖవదేవ కథయేత్.

అ. మూర్ఖులతో మూర్ఖుడులాగే మాట్లాడాలి.

65. ఆయసైరాయసం భేద్యమ్.

అ. ఇనుపదానిని ఇనుపదానితోనే ఛేదించాలి.

66. నాస్త్యధీమతః సఖా.

అ. తెలివితక్కువవాడికి స్నేహితు డుండడు.

తృతీయాధ్యాయం సమాప్తం

# చతుర్థాధ్యాయం ప్రారంభం

1. ధర్మేణ ధార్యతే లోకః.

అ. లోకాన్ని ధర్మమే నిలబెడుతూన్నది.

2. ప్రేతమపి ధర్మాధర్మా వనుగచ్ఛతః.

అ. చచ్చిన వానిని కూడా ధర్మాధర్మాలు వెంబడిస్తాయి.

3. దయా ధర్మస్య జన్మభూమిః.

అ. ధర్మానికి పుట్టినిల్లు దయ.

4. ధర్మమూలే సత్యదానే.

అ. సత్యమూ, దానమూ ధర్మానికి మూలం. లేదా సత్య-దానాలకి ధర్మం మూలం.

5. ధర్మేణ జయతి లోకాన్.

అ. ధర్మంచేత లోకాల్ని జయిస్తాడు.

6. మృత్యురపి ధర్మిష్ఠం రక్షతి.

అ. ధర్మాత్ముణ్ణి మృత్యుదేవత కూడా రక్షిస్తుంది.

7. ధర్మాద్విపరీతం పాపం యత్ర యత్ర ప్రసజ్యతే తత్ర తత్ర ధర్మావమతిరేవ మహతీ ప్రసజ్యతే.

అ. ధర్మానికి విరుద్ధమైన పాపం ఎక్కడెక్కడ ప్రవర్తిస్తుందో అక్కడ ధర్మానికి పెద్ద అవమానం కలుగుతుంది. లేదా ధర్మం పేరిట దానికి విరుద్ధమైన పాపం ఎక్కడెక్కడ వ్యాపిస్తుందో అక్కడ ధర్మానికి అవమానమే జరుగుతుంది.

8. ఉపస్థితవినాశానాం ప్రకృతిః ఆకారేణ కార్యేణ చ లక్ష్యతే.

అ. వినాశం దగ్గరపడ్డ వాళ్ళ స్వభావం వాళ్ళ ఆకారంచేత, చేసే పనులచేత తెలుస్తుంది.

9. ఆత్మవినాశం సూచయత్యధర్మబుద్ధిః.

అ. అధర్మబుద్ధి ఆత్మవినాశాన్ని (తన నాశాన్ని) సూచిస్తుంది.

10. పిశునవాదినో రహస్యం కుతః ?

అ. చాడీలు చెప్పేవాడికి రహస్యం ఏమిటి ?

11. పరరహస్యం నైవ శ్రోతవ్యమ్.

అ. ఇతరుల రహస్యాలు వినకూడదు.

12. వల్లభస్య స్వార్థపరత్వమధర్మయుక్తమ్.

అ. ప్రియు డనుకొన్నవాడు స్వార్థపరుడై ఉండడం అధర్మం.

13. స్వజనే ష్వతిక్రమో న కర్తవ్యః.

అ. తనవాళ్ళ విషయంలో కూడా మర్యాదను అతిక్రమించకూడదు.

14. మాతాపి దుష్టా త్యాజ్యా.

అ. తల్లైనా దుష్టురాలైతే విడిచి పెట్టి వేయాలి.

15. స్వహస్తోఽపి విషదిగ్ధశ్ఛేద్యః.

అ. విషం పూసిన తన చేతినైనా నరికి వెయ్యాలి.

16. పరోఽపి చ హితో బన్ధుః.

అ. పరాయివాడైనా హితుడు బందువే.

17. కక్షాదప్యౌషధం గృహ్యతే.

అ. పొదలో నుంచైనా ఔషధం గ్రహించబడుతుంది.

18. నాస్తి చోరేషు విశ్వాసః.

అ. దొంగలమీద నమ్మకం పనికిరాదు.

19. అప్రతీకారేష్వనాదరో న కర్తవ్యః.

అ. ప్రతిక్రియ చేయని వారి విషయంలో అనాదరం చెయ్యకూడదు. మనం చేసిన దానికి ఇతడు ఏమీ ప్రతిక్రియ (ప్రత్యుపకారం మొ.)

చేయలేదు కదా అని ఏమరి ఉండకూడదు. అతడు ఎప్పుడైనా చేయవచ్చు.

20. వ్యసనం మనాగపి బాధతే.

అ. కొంచమైనా వ్యసనం (దుఃఖం లేదా దుర్వ్యసనం) బాధిస్తుంది.

21. అమరవదర్థజాతమర్జయేత్.

అ. ధనం సంపాదించేటప్పుడు "నాకు మరణం లేదు" అన్నట్లు సంపాదించాలి.

22. అర్థవాన్ సర్వలోకస్య బహుమతః.

అ. ధనవంతుణ్ణి అందరూ గౌరవిస్తారు.

23. మహేన్ద్రమప్యర్థహీనం న బహుమన్యతే లోకః.

అ. సాక్షాత్తూ దేవేంద్రుడే అయినా ధనం లేనివాణ్ణి లోకం గౌరవించదు.

24. దారిద్ర్యం ఖలు పురుషస్య సజీవితం మరణమ్.

అ. మానవుడికి దారిద్ర్యం అనేది జీవించి ఉండగానే మరణం.

25. విరూపోఽప్యర్థవాన్ సురూపః.

అ. కురూపి అయినా ధనం ఉంటే సౌందర్యవంతుడు.

26. అదాతారమప్యర్థవన్తమర్థినో న త్యజన్తి.

అ. ఏమీ ఇవ్వని వాడైనా ధనికుణ్ణి యాచకులు విడిచిపెట్టరు.

27. అకులీనోఽపి ధనవాన్ కులీనాద్విశిష్టః.

అ. సత్కులంలో పుట్టినవాడు కాకపోయినా ధనవంతుడు కులీనుడే.

28. నాస్త్యవమానభయమనార్యస్య.

అ. నీచుడు అవమానానికి భయపడడు.

29. నోద్యోగవతాం వృత్తిభయమ్.

అ. ఉద్యమశీలురకు (పాటుపడేవాళ్ళకి) వృత్తి దొరకదనే భయం లేదు.

30. న జితేంద్రియాణాం విషయభయమ్.

అ. ఇంద్రియాలను జయించినవాళ్ళకి భోగ్యవిషయాలవల్ల భయం ఉండదు.

31. న కృతార్థానాం మరణభయమ్.

అ. కర్తవ్యాలన్నీ చేసుకొన్నవాళ్ళు మరణానికి భయపడరు.

32. కస్యచిదర్థం స్వమివ మన్యతే సాధుః.

అ. అది ఎవరి సొత్తైనా తన సొత్తే అనుకొని సంతోషిస్తూ ఉంటాడు సత్పురుషుడు.

33. పరవిభవేష్వాదరో న కర్తవ్యః.

అ. పరుల ఐశ్వర్యాల మీద ఆదరం (ఆసక్తి) చూపకూడదు.

34. పరవిభవేష్వాదరోఽపి నాశమూలమ్.

అ. పరుల వైభవాల మీద ఆదరం చూపినా కూడా అది నాశనానికి దారి తీస్తుంది.

35. పలాలమపి పరద్రవ్యం న హర్తవ్యమ్.

అ. పరద్రవ్యం గింజ లేని పొట్టు కూడ హరించకూడదు.

36. పరద్రవ్యాపహరణమాత్మద్రవ్యనాశహేతుః.

అ. పరుల ద్రవ్యం హరించడం వల్ల తన ద్రవ్యం నశిస్తుంది.

37. న చౌర్యాత్పరం మృత్యుపాశః.

అ. దొంగతనాన్ని మించిన యమపాశం లేదు. దొంగతనం తప్ప మరొక యమపాశం లేదు.

38. యవాగూరపి ప్రాణధారణం కరోతి కాలే.

అ. కొన్ని సమయాలలో గంజి కూడా ప్రాణాలను నిలబెడుతుంది.

39. న మృతస్యౌషధం ప్రయోజనమ్.

అ. చచ్చినవానికి ఔషధం నిరుపయోగం.

40. సమకాలే ప్రభుత్వస్య ప్రయోజనం భవతి.

అ. కాలం సమంగా ఉన్నప్పుడే, అనగా కాలం విషమంగా, విపరీతంగా లేనప్పుడే, ప్రభుత్వం వల్ల ప్రయోజనం ఉంటుంది. విషమకాలంలో ప్రభుత్వం లభించినా అన్నీ కష్టాలే.

41. నీచస్య విద్యాః పాపకర్మణ్యేవ తం యోజయన్తి.

అ. నీచుడికి విద్యలు ఉన్నా అవి వానిచేత పాపకర్మలే చేయిస్తాయి.

42. పయఃపానమపి విషవర్ధనం భుజఙ్గస్య న త్వమృతం స్యాత్.

అ. పాము పాలు తాగితే విషమే పెరుగుతుంది కాని అవి అమృతంగా మారవు.

43. న హి ధాన్యసమో హ్యర్థః.

అ. ధాన్యం వంటి ధనం లేదు.

44. న క్షుధాసమః శత్రుః.

అ. ఆకలి వంటి శత్రువు లేదు.

45. అకృతేర్నియతా క్షుత్.

అ. పనిలేనివానికి ఎప్పుడూ ఆకలే.

46. నాస్త్యభక్ష్యం క్షుధితస్య.

అ. ఆకలిగొన్న వాడికి తినదగనిదంటూ లేదు.

47. ఇన్ద్రియాణి ప్రతిపదం నరాన్ జరాకృశాన్ కుర్వన్తి.

అ. ఇంద్రియాలు మనుష్యుల్ని అడుగడుగునా ముసలితనంచేత (దౌర్బ ల్యంచేత) కృశించిపోయేటట్లు చేస్తాయి.

48. సానుక్రోశం భర్తారమాజీవేత్.

అ. జాలిగల ప్రభువును ఆశ్రయించి బ్రతకాలి.

49. లుబ్ధసేవీ పావకేచ్ఛయా ఖద్యోతం ధమతి.

అ. లోభియైన ప్రభువును సేవించేవాడు నిప్పుకోసం మెరుగుడు పురుగును

పట్టుకొని ఊదినట్లే.

50. విశేషజ్ఞం స్వామినమాశ్రయేత్.

అ. ఇతరుల గుణాలను తెలిసికొనగలిగిన ప్రభువును ఆశ్రయించాలి.

51. పురుషస్య మైథునం జరా.

పురుషుడికి మైథునం ముసలితనం (దౌర్బల్యహేతువు).

52. స్త్రీణామమైథునం జరా.

అ. స్త్రీలకు మైథునం లేకపోవడం ముసలితనం.

53. న నీచోత్తమయోర్వివాహః.

అ. నీచులకీ ఉత్తములకి మధ్య వివాహసంబంధం కుదరదు.

54. అగమ్యాగమనాదాయుర్యశఃపుణ్యాని క్షీయతే.

అ. కూడని స్త్రీతో సంబంధంవల్ల ఆయుర్దాయము, కీర్తి, పుణ్యమూ కూడా నశిస్తాయి.

55. నాస్త్యహంకారసమః శత్రుః.

అ. అహంకారం వంటి శత్రువు లేదు.

56. సంసది శత్రుం న పరిక్రోశేత్.

అ. శత్రువుని సభలో (పదిమందిలో) నిందించగూడదు.

57. శత్రువ్యసనం శ్రవణసుఖమ్.

అ. శత్రువు కష్టాలలో ఉన్నాడంటే వినడానికి చాలా ఆనందకరం.

58. అధనస్య బుద్ధిర్న విద్యతే.

అ. ధనంలేనివానికి బుద్ధిఉండదు (బుద్ధి పనిచెయ్యదు).

59. హితమప్యధనస్య వాక్యం న గృహ్యతే.

అ. ధనం లేనివానిమాట హితకరమే అయినా వినరు.

60. అధనః స్వభార్యయాఽప్యవమన్యతే.

అ. ధనం లేనివాణ్ణి భార్య కూడా అవమానిస్తుంది.

61. పుష్పహీనం సహకారమపి నోపాసతే భ్రమరాః.

అ. తియ్య మామిడి చెట్టే అయినా పువ్వులు లేకపోతే తుమ్మెదలు దాని దరికి చేరవు.

చతుర్థాధ్యాయం సమాప్తం

# పఞ్చమాధ్యాయం

1. విద్యా ధనమధనానామ్.
అ. ధనం లేనివాళ్ళకి విద్యయే ధనం.

2. విద్యా చోరైరపి న గ్రాహ్యా.
అ. విద్యను దొంగలు కూడా అపహరించలేరు.

3. విద్యయా సులభా ఖ్యాతిః.
అ. విద్యవల్ల ప్రసిద్ధి లభిస్తుంది.

4. యశఃశరీరం న వినశ్యతి.
అ. విద్యావంతుల భౌతికశరీరం నశించినా యశస్సు అనే శరీరం నశించదు.

5. యః పరార్థమన్యముపసర్పతి స సత్పురుషః.
అ. (స్వప్రయోజనం కోసం కాక) ఇతరుల పనిమీద అన్యుల దగ్గరికి వెళ్ళేవాడు సత్పురుషుడు.

6. ఇంద్రియాణాం ప్రశమం శాస్త్రమ్.
అ. ఇంద్రియాలకి శాంతిని ఇచ్చేది శాస్త్రం.

7. అకార్యప్రవృత్తేః శాస్త్రాఙ్కుశం నివారయతి.
అ. చేయకూడని పని చేయబోతూంటే శాస్త్రం అనే అంకుశం నివారిస్తుంది.

8. నీచస్య విద్యా నోపేతవ్యా.
అ. నీచుని విద్య నేర్వగూడదు.

9. మ్లేచ్ఛభాషణం న శిక్షేత.
అ. మ్లేచ్ఛుల మాటలు నేర్చుకోకూడదు.

10. మ్లేచ్ఛానామపి సువృత్తం గ్రాహ్యమ్.
అ. మ్లేచ్ఛులదే అయినా మంచి నడవడికను గ్రహించాలి.

11. గుణే న మత్సరః కార్యః.

అ. ఇతరుల సద్గుణాలు చూచి అసూయ పడకూడదు.

12. శత్రోరపి సుగుణో గ్రాహ్యః.

అ. శత్రువునుండైనా సుగుణం నేర్చుకోవాలి. లేదా శత్రువులో ఉన్నా సుగుణాన్ని మెచ్చుకోవాలి.

13. విషాదప్యమృతం గ్రాహ్యమ్.

అ. విషంలో ఉన్నా అమృతం గ్రహించాలి.

14. అవస్థయా పురుషః సంమాన్యతే.

అ. ఆతడున్న స్థితి (Status)ని పట్టి పురుషుణ్ణి గౌరవిస్తారు.

15. స్థాన ఏవ నరాః పూజ్యాః.

అ. వాళ్లుండవలసిన స్థానంలో ఉన్నప్పుడే మనుష్యుల్ని పూజిస్తారు.

16. ఆర్యవృత్తమనుతిష్ఠేత్.

అ. పూజ్యుల నడవడికను అనుసరించాలి.

17. కదాపి మర్యాదాం నాతిక్రమేత్.

అ. ఎన్నడూ కట్టుబాట్లు దాటకూడదు.

18. నాస్త్యర్ఘః పురుషరత్నస్య.

అ. పురుషశ్రేష్ఠుడికి వెల కట్టలేం.

19. న స్త్రీరత్నసమం రత్నమ్.

అ. స్త్రీ రత్నం వంటి రత్నం లేదు.

20. సుదుర్లభం హి రత్నమ్.

అ. రత్నం చాలా దుర్లభమైనది. లేదా చాలా దుర్లభమైనదే రత్నం.

21. అయశోభయం భయమ్.

అ. అన్ని భయలలోకీ గొప్ప భయం అపకీర్తిభయం.

22 నా స్త్యలసస్య శాస్త్రాధిగమః.
అ. సోమరికి శాస్త్రజ్ఞానం లభించదు.

23. న స్త్రైణస్య స్వర్గాప్తిర్ధర్మకృత్యం చ.
అ. స్త్రీలంపటుడికి స్వర్గం కాని ధర్మాచరణం కాని లేదు.

24. స్త్రియోఽపి స్త్రైణమవమన్య న్తే.
అ. స్త్రీలంపటుణ్ణి స్త్రీలు కూడా అవమానిస్తారు.

25. న పుష్పార్థీ సిఞ్చతి శుష్కతరుమ్.
అ. పువ్వులు కావలసినవాడు ఎండు చెట్టుకు నీళ్ళు పోయడు.

26. అద్రవ్యయత్నో వాలుకాక్వాథనాదనన్యః.
అ. అయోగ్యవస్తువును లేదా వ్యక్తిని యోగ్యంగా తయారుచేయడం కోసం చేసే ప్రయత్నం ఇసుక ఉడకబెట్టడమే.

27. న మహాజనహాసః కర్తవ్యః.
అ. పెద్దలని పరిహసించకూడదు.

28. కార్యసంపదం నిమిత్తాని సూచయన్తి.
అ. తలపెట్టిన పని సఫలం అవుతుందా అవదా అన్న విషయాన్ని శకునాలు సూచిస్తాయి. శకునాలనగా దుఃస్వప్నం, అవయవాలు అదరడం మొదలైనవి.

29. నక్షత్రాదపి నిమిత్తాని విశేషయన్తి.
అ. నక్షత్రం కంటె (జ్యోతిఃశాస్త్రం కంటె) కూడా శకునాలు విశిష్టమైనవి. ఇవి నిజం అవుతాయి.

30. న త్వరితస్య నక్షత్రపరీక్షా.
అ. పని తొందరలో ఉన్నవాడికి నక్షత్రపరీక్ష అనవసరం.

31. పరిచయే దోషా న ఛాద్యన్తే.
అ. బాగా పరిచయం ఉన్నవాళ్ళ దగ్గర ఎవరూ తమ దోషాలు(లోపాలు) దాచుకోలేరు.

32. స్వయమశుద్ధః పరానాశఙ్కతే.

అ. ఏవో లోపాలు ఉన్నవాడే ఇతరులను శంకిస్తాడు.

33. స్వభావో దురతిక్రమః.

అ. స్వభావాన్ని అతిక్రమించడం కష్టం.

34. అపరాధానురూపో దణ్డః.

అ. అపరాధాన్ని పట్టి దండనం ఉంటుంది.

35. ప్రశ్నానురూపం ప్రతివచనమ్.

అ. అడిగిన ప్రశ్నను బట్టి సమాధానం ఉంటుంది.

36. విభవానురూపమాభరణమ్.

అ. ఐశ్వర్యానికి తగిన అలంకరణం (ఐశ్వర్యం కొలదీ అలంకరణం).

37. కులానురూపం వృత్తమ్.

అ. కులాన్ని అనుసరించి నడవడిక ఉంటుంది.

38. కార్యానురూపః యత్నః.

అ. ఎలాంటి కార్యమో అలాంటి ప్రయత్నం.

39. పాత్రానురూపం దానమ్.

అ. పాత్రను (తీసుకొనే వాని యోగ్యతను) పట్టి దానం.

40. వయోనురూపో వేషః.

అ. వయస్సును పట్టి వేషం ఉండాలి.

41. స్వామ్యనుకూలో భృత్యః.

అ. యజమానికి తగిన భృత్యుడు.

42. భర్తృవశవర్తినీ భార్యా.

అ. భర్త చెప్పుచేతల్లో ఉండేది భార్య.

43. గురువశానువర్తీ శిష్యః.

అ. గురువు చెప్పినట్లు నడచుకొనేవాడు శిష్యుడు.

44. పితృవశానువర్తీ పుత్రః.

అ. తండ్రి మాట వినేవాడే పుత్రుడు.

45. అత్యుపచారః శఙ్కితవ్యః.

అ. అతిగా ఆదరం చూపిస్తే శంకించవలసి ఉంటుంది.

46. స్వామిని కుపితే స్వామినమేవానువర్తేత.

అ. ప్రభువు కోపించినా అతనినే అనుసరించి ఉండాలి.

47. మాతృతాడితో వత్సో మాతరమేవానురోదితి.

అ. తల్లి కొడితే పిల్లవాడు తల్లి పేరుతోనే ఏడుస్తాడు.

48. స్నేహవతః స్వల్పో హి రోషః.

అ. స్నేహం ఉన్నవాని కోపం స్వల్పంగానే ఉంటుంది.

49. బాలిశః అత్మచ్ఛిద్రం న పశ్యతి, అపి తు పరచ్ఛిద్రమేవ పశ్యతి.

అ. మూర్ఖుడు తనలో ఉన్న లోపాలు చూచుకోడు. పరుల లోపాలే చూస్తాడు.

50. సదోపచారః కితవః.

అ. ఎల్లప్పుడూ అత్యాదరం చూపేవాడు ధూర్తుడు.

51. కామైర్విశేషైరుపచారణముపచారః.

అ. ఏవో కోరికలు మనస్సులో పెట్టుకొని చేసే ఆదరం "ఉపచారం."

52. చిరపరిచితానామప్యుపచారః శఙ్కితవ్యః.

అ. చాలా కాలం నుంచి పరిచయం ఉన్నవాళ్ళకి కూడా ఉపచారం చేస్తే శంకించవలసి ఉంటుంది.

53. శ్వసహస్రాదేకాకినీ గౌః శ్రేయసే.

అ. వెయ్యి కుక్కలకంటె ఒక్క ఆవు మేలు.

54. శ్వో మయూరాదద్య కపోతో వరః.

అ. రేపటి నెమలికంటె నేటి పావురం మేలు.

55. అతిసఙ్గో దోషముత్పాదయతి.

అ. అతిగా పెట్టుకున్న సంబంధం దోషానికి హేతువు అవుతుంది.

56. సర్వం జయత్యక్రోధః.

అ. క్రోధం లేనివాడు అన్నింటినీ (అందరినీ) జయిస్తాడు.

57. యద్యపకారిణి కోపః కర్తవ్యః తర్హి స్వకోపే ఏవ కోపః కర్తవ్యః.

అ. అపకారం చేసేవానిమీద కోపం చూపవలసి ఉంటే తన కోపం మీదే కోపం చూపాలి.

58. మతిమత్సు మూర్ఖమిత్రగురువల్లభేషు వివాదో న కర్తవ్యః.

అ. బుద్ధిమంతులతోను, మూర్ఖులతోను, మిత్రులతోను, గురువులతోను, ఇష్టులైన వారితోను వాగ్వాదానికి దిగకూడదు.

59. నాస్త్యపిశాచమైశ్వర్యమ్.

అ. పిశాచాలు లేని ఐశ్వర్యం లేదు. అత్యధికంగా ఐశ్వర్యం కూడబెట్టిన వాడు మరణానంతరం పిశాచం అవుతాడు.

60. నాస్తి ధనవతాం సుకర్మసు శ్రమః.

అ. ధనవంతులకు మంచి పనులు చేయడానికి శ్రమ ఉండదు.

61. నాస్తి గతిశ్రమో యానవతామ్.

అ. వాహనం ఉన్నవాళ్ళకి నడిచే శ్రమ ఉండదు.

62. అలోహమయం నిగడం కలత్రమ్.

అ. భార్య ఇనుముతో చేయని సంకెల.

63. యో యస్మిన్ కర్మణి కుశలః స తస్మిన్ యోక్తవ్యః.

అ. ఎవనికి ఏ పనిలో నైపుణ్యం ఉందో వానిని ఆ పనిలో నియోగించాలి.

64. దుష్కలత్రం మనస్వినాం శరీరకర్శనమ్.

అ. చెడ్డ భార్య ఆత్మాభిమానవంతుల శరీరాలు కృశింప చేస్తుంది.

65. అప్రమత్తో దారాన్ నిరీక్షేత.

అ. భార్యను జాగరూకతతో చూచుకోవాలి.

66. స్త్రీషు న కించిదపి విశ్వసేత్.

అ. స్త్రీల విషయంలో కొంచెం కూడా విశ్వసించకూడదు.

67. న సమాధిః స్త్రీషు లోకజ్ఞతా చ.

అ స్త్రీలలో చిత్తస్థైర్యం కాని లోకజ్ఞానం కాని ఉండవు.

68. గురూణాం మాతా గరీయసీ.

అ. పూజ్యులలో తల్లి గొప్పది.

69. సర్వావస్థాసు మాతా భర్తవ్యా.

అ. అన్ని అవస్థలలోనూ తల్లిని పోషించాలి.

70 వైరూప్యమలంకారేణాచ్ఛాద్యతే.

అ. కురూపాన్ని అలంకారం చేత కప్పుకొనవచ్చు.

71. స్త్రీణాం భూషణం లజ్జా.

అ. స్త్రీలకు లజ్జ అలంకారం.

72. విప్రాణాం భూషణం వేదః.

అ. బ్రాహ్మణులకు అలంకారం వేదం.

73. సర్వేషాం భూషణం ధర్మః.

అ. అందరికీ అలంకారం ధర్మం.

74. భూషణానాం భూషణం సవినయా విద్యా.

అ. వినయ సంపన్నమైన విద్య అలంకారాలకి అలంకారం.

పఞ్చమాధ్యాయం సమాప్తం.

# షష్ఠాధ్యాయం

1. అనుపద్రవం దేశమావసేత్.

అ. ఏ ఉపద్రవాలూ లేని దేశంలో నివసించాలి.

2. సాధుజనబహులో దేశ ఆశ్రయణీయః.

అ. ఎక్కువ మంది సత్పురుషు లున్న దేశంలో నివసించాలి.

3. రాజ్ఞో భేతవ్యం సర్వకాలమ్.

అ. ఎల్లప్పుడూ రాజుకు భయపడాలి.

4. న రాజ్ఞః పరం దైవతమ్.

అ రాజును మించిన దేవుడు లేడు.

5. సుదూరమపి దహతి రాజవహ్నిః

అ. రాజు అనే అగ్ని ఎంత దూరంలో ఉన్నా కాలుస్తుంది.

6. రిక్తహస్తో న రాజానమభిగచ్ఛేత్ గురుం దైవం చ.

అ. రాజు దగ్గరికి. గురువు దగ్గరికీ, దేవుడి దగ్గరికి రిక్తహస్తాలతో వెళ్ళకూడదు.

7. కుటుమ్బినో భేతవ్యమ్.

అ. పెద్ద కుటుంబం కలవానికి భయపడాలి.

8. గన్తవ్యం సదా రాజకులమ్.

అ. ఎల్లప్పుడూ రాజగృహానికి వెడుతూండాలి.

9. రాజపురుషైః సంబన్ధం కుర్యాత్.

అ. రాజపురుషలతో (అధికారులతో) సంబంధం పెట్టుకోవాలి.

10. రాజదాసీ న సేవితవ్యా.

అ. రాజదాసితో (రాజుకి సంబంధించిన వేశ్యాదులతో) సంబంధం పెట్టుకో కూడదు.

11. న చక్షుషాపి రాజానం వీక్షేత.

అ. రాజువైపు కన్నెత్తి చూడకూడదు (అతని ముందు వినయంగా తల వంచుకొని ఉండాలి.)

12. పుత్రే గుణవతి కుటుమ్బినః స్వర్గః.

అ. పుత్రుడు గుణవంతుడైతే గృహస్థునికి అది స్వర్గమే.

13. పుత్రా విద్యానాం పారం గమయితవ్యాః

అ. పుత్రులకి బాగా చదువు చెప్పించాలి.

14. జనపదార్థం గ్రామం త్యజేత్.

అ. దేశంకోసం గ్రామాన్ని పరిత్యజించాలి.

15. గ్రామార్థం కుటుమ్బస్త్యజ్యతే.

అ. గ్రామం కోసం కుటుంబాన్ని విడిచిపెట్టాలి.

16. అతిలాభః పుత్రలాభః.

అ. పుత్రలాభం అన్నింటినీ మించిన లాభం.

17. దుర్గతేర్యః పితరౌ రక్షతి స పుత్రః.

అ. తల్లిదండ్రుల్ని దుర్గతి పాలవకుండా రక్షించేవాడే పుత్రుడు.

18. యః కులం ప్రఖ్యాపయతి స పుత్రః.

అ. కులానికి ప్రతిష్ఠ తెచ్చేవాడే పుత్రుడు.

19. నానపత్యస్య స్వర్గః.

అ. సంతానం లేనివానికి స్వర్గం లేదు.

20. యా ప్రసూతే సా భార్యా.

అ. పిల్లలని కన్నదే భార్య.

21. తీర్థసమవాయే పుత్రవతీ మనుగచ్ఛేత్.

అ. (చాల మంది భార్యలున్నవాడు) ఒకే సమయంలో ఇద్దరు, ముగ్గురు

భార్యలు ఋతుకాలంలో ఉన్నప్పుడు) పుత్రులను కని ఉన్న భార్యను పొందాలి.

22. న తీర్థాభిగమనాత్ బ్రహ్మచర్యం నశ్యతి.

అ. ఋతుమతీ సంబంధంవల్ల బ్రహ్మచర్యానికి విఘాతం కలగదు.

23. న పరక్షేత్రే బీజం నిక్షిపేత్.

అ. పరభార్యలయందు బీజం ఉంచకూడదు.

24. పుత్రార్థా హి స్త్రియః.

అ. స్త్రీలు పుత్రులను కనడం కోసమే కదా.

25. స్వదాసీ పరిగ్రహో హి స్వస్యైవ దాసత్వాపాదనమ్.

అ. తన దాసితో సంబంధం పెట్టుకోవడం తాను దాసత్వాన్ని పొందడమే (దాసి భర్త దాసుడు కదా.)

26. ఉపస్థితవినాశః పథ్యవాక్యం న శృణోతి.

అ. వినాశం దగ్గర పడ్డవాడు హితం చెబితే వినడు.

27. నాస్తి దేహినాం సుఖదుఃఖాభావః.

అ. ప్రాణులకు సుఖం లేకపోవడం గాని, దుఃఖం లేకపోవడం గాని ఉండదు.

28. మాతరమివ వత్సాః సుఖదుఃఖాని కర్తారమేవానుగచ్ఛన్తి.

అ. లేగదూడలు తల్లి వెంట వెళ్ళినట్లు సుఖదుఃఖాలు పుణ్యపాపకర్మలు చేసినవాళ్ళ దగ్గరికే వెడతాయి.

29. తిలమాత్రమప్యుపకారం శైలమాత్రం మన్యతే సాధుః.

అ. తనకు చేసిన నువ్వుగింజంత ఉపకారం కూడా పర్వతం అంతగా భావిస్తాడు సత్పురుషుడు.

30. ఉపకారోఽనార్యేష్వకర్తవ్యః.

అ. చెడ్డవారికి ఉపకారం చెయ్యకూడదు.

31. ప్రత్యుపకారభయాదనార్యః శత్రుర్భవతి.

అ. ఎక్కడ ప్రత్యుపకారం చేయవలసి వస్తుందో అన్న భయంచేత నీచుడు శత్రుత్వాన్ని వహిస్తాడు.

32. స్వల్పోపకారకృతేఽపి ప్రత్యుపకారం కర్తుమార్యో జాగర్తి.

అ. ఉత్తముడు తాను పొందిన స్వల్పమైన ఉపకారానికి కూడా ప్రత్యుపకారం చేయడానికి వేచి ఉంటాడు.

33. న కదాపి దేవతాఽవమన్తవ్యా.

అ. దేవతను ఎన్నడూ అవమానించకూడదు.

34. న చక్షుషః సమం జ్యోతిరస్తి.

అ. కన్ను వంటి తేజస్సు లేదు.

35. చక్షుర్హి శరీరిణాం నేతా.

అ. ప్రాణుల్ని నడిపించేది నేత్రమే కదా ?

36. అపచక్షుషః కిం శరీరేణ.

అ. కళ్ళు లేని వానికి శరీరం ఉండి ఏమి ప్రయోజనం ?

37. నాప్సు మూత్రం కుర్యాత్.

అ. నీళ్ళల్లో మూత్రవిసర్జనం చెయ్యకూడదు.

38. న నగ్నో జలం ప్రవిశేత్.

అ. నగ్నంగా నీటిలోకి దిగకూడదు.

39. యథా శరీరం తథా జ్ఞానం.

అ. శరీరం ఎలా ఉంటే జ్ఞానం అలాగే ఉంటుంది.

40. యథా బుద్ధిస్తథా విభవః.

అ. బుద్ధి బలం ఎలా ఉంటే వైభవం అలాగే ఉంటుంది.

41. అగ్నావగ్నిం న నిక్షిపేత్.

అ. అగ్నిలో మరొక అగ్నిని వేయకూడదు.

42 తపస్వినః పూజనీయాః.

అ. తపఃశాలులను పూజించాలి.

43. పరదారాన్ న గచ్ఛేత్.

అ. పరభార్యతో వెళ్ళకూడదు.

44. అన్నదానం భ్రూణహత్యామపి మార్ష్టి.

అ. అన్నదానం భ్రూణహత్యా దోషాన్ని కూడా తుడిచివేస్తుంది.

45. న వేదబాహ్యో ధర్మః.

అ. వేదవిరుద్ధమైనది ధర్మంకాదు.

46. కథంచిదపి ధర్మం నిషేవేత్.

అ. ఎంత శ్రమ పడైనా ధర్మాన్ని సేవించాలి.

47. స్వర్గం నయతి సూనృతమ్.

అ. సత్యమూ, హితమూ అయిన వాక్యం స్వర్గానికి తీసికొని వెడుతుంది.

48. నాస్తి సత్యాత్ పరం తపః.

అ. సత్యాన్ని మించిన తపస్సు లేదు.

49. సత్యం స్వర్గస్య సాధనమ్.

అ. సత్యం స్వర్గానికి సాధనం.

50. సత్యేన ధార్యతే లోకః.

అ. సత్యమే లోకాన్ని నిలబెడుతూన్నది.

51. సత్యాద్దేవో వర్షతి.

అ. సత్యం వల్లనే దేవుడు వర్షిస్తున్నాడు.

52. అనృతాత్పాతకం పరమ్.

అ. అసత్యాన్ని మించిన మరొక పాపం లేదు.

53. న మీమాంస్యా గురవః.

అ. పెదల్ని విమర్శించగూడదు.

54. ఖలత్వం నోపేయాత్.

అ. దుష్టుడుగా అవకూడదు.

55. నాస్తి ఖలస్య మిత్రమ్.

అ. దుష్టుడికి మిత్రుడనేవాడు ఉండడు.

56. లోకయాత్రా దరిద్రం బాధతే.

అ దరిద్రుడికి నిత్యజీవనం కూడా కష్టంగా ఉంటుంది.

57. అతిశూరో దానశూరః.

అ. దానశూరుడే గొప్పశూరుడు.

58. గురుదేవబ్రాహ్మణేషు భక్తిర్భూషణమ్.

అ. గురువులమీదా, దేవతలమీదా, సద్బ్రాహ్మణుల మీదా భక్తి ఉండడం అలంకారం.

59. సర్వస్య భూషణం వినయః.

అ. వినయం అందరికీ అలంకారమే.

60. అకులీనోఽపి వినయః కులీనాద్విశిష్టః.

అ. ఉత్తమకులంలో పుట్టకపోయినా వినయవంతుడు ఉత్తమకులం వాడి కంటె గొప్పవాడు.

61. ఆచారాదాయుర్వర్ధతే కీర్తిః శ్రేయశ్చ.

అ. సదాచారం (సత్ప్రవర్తన) వల్ల ఆయురాయం, కీర్తి, శ్రేయస్సు వృద్ధి పొందుతాయి.

62. ప్రియమప్యహితం న వక్తవ్యమ్.

అ. ప్రియమే అయినా హితం కానిది చెప్పకూడదు.

63. బహుజనవిరుద్ధమేకం నానువర్తేత.

అ. చాలమంది అభిప్రాయానికి వ్యతిరేకంగా నడిచే ఒక వ్యక్తిని అనుస రించకూడదు.

64. న కృతార్థేషు నీచేషు సంబన్ధః.

అ. పనులు చేసిపెట్టే వాళ్ళైనా నీచులతో సంబంధం పెట్టుకోకూడదు.

65. ఋణశత్రువ్యాధయో నిఃశేషాః కర్తవ్యాః.

అ. ఋణాన్ని, శత్రువుల్ని, వ్యాధుల్ని పూర్తిగా రూపుమాపాలి.

66. భూత్యనువర్తనం పురుషస్య రసాయనమ్.

అ. ఐశ్వర్యం అవిచ్ఛిన్నంగా ఉండడమే మనిషికి బలవర్ధకౌషధం.

67. నార్థిష్వవజ్ఞా కర్తవ్యా.

అ. యాచకుల విషయంలో అనాదరం చూపకూడదు.

68. దుష్కరం కర్మ కారయిత్వా కర్తారమవమన్యతే నీచః.

అ. నీచుడు కష్టమైన పని చేయించుకొని ఆ చేసిన వాణ్ణే అవమానిస్తాడు.

69. నాకృతజ్ఞస్య నరకాన్నివర్తనమ్.

అ. కృతజ్ఞత లేనివాడు నరకం నుంచి తిరిగి రావడం ఉండదు.

70. జిహ్వాయత్తౌ వృద్ధినాశౌ.

అ. అభివృద్ధియైనా, వినాశమైనా నాలుకమీదనే ఉంటాయి.

71. విషామృతయోరాకరీ జిహ్వా.

అ. నాలుక విషానికీ అమృతానికీ కూడా గని (జన్మస్థానం)

72. ప్రియవాదినో న శత్రుః.

అ. ప్రియంగా మాట్లాడే వాడికి శత్రువు ఉండదు.

73. స్తుతా అపి దేవాస్తుష్యన్తి.

అ. స్తోత్రం చేస్తే దేవతలు కూడా సంతోషిస్తారు.

74. అన్నృతమపి దుర్వ్వచనం చిరం తిష్ఠతి.

అ. అసత్యమే అయినా చెడ్డ మాట (అపవాదు) చాలా కాలం నిలిచి పోతుంది.

75. రాజద్విష్టం న వక్తవ్యమ్.

అ. రాజుకు (ప్రభువుకు) ద్వేషం కలిగించే మాట మాట్లాడకూడదు.

76. శ్రుతిసుఖాత్ కోకిలాలాపాదపి తుష్యన్తి జనాః.

అ. చెవికి ఇంపుగా ఉండే కోకిల కూత విన్నా కూడా జనులు సంతోషిస్తారు.

77. స్వధర్మహేతుః సత్పురుషః.

అ. స్వధర్మానికి హేతువైనవాడే (స్వధర్మం నిలబెట్టే వాడే) సత్పురుషుడు.

78. నాస్త్యర్థినో గౌరవమ్.

అ. యాచకుడికి గౌరవం ఉండదు.

79. స్త్రీణాం భూషణం సౌభాగ్యమ్.

అ. స్త్రీలకు సౌభాగ్యమే (ఐదవతనం) అలంకారం.

80. శత్రోరపి న పాతనీయా వృత్తిః.

అ. శత్రువైనా వాడి కడుపు కొట్టకూడదు.

81. అప్రయత్నోదకం క్షేత్రమ్.

అ. ఎక్కువ ప్రయత్నం చేయకపోయినా నీరు లభించేదే మంచి పొలం.

82. ఏరణ్డమవలమ్బ్య కుఞ్జరం న కోపయేత్.

అ. ఆముదంచెట్టు ఆసరా చూచుకొని ఏనుగకు కోపం కలిగించకూడదు.

83. అతిప్రవృద్ధాపి శాల్మలీ వారణస్తమ్భో న భవతి.

అ. ఎంత లావుగా పెరిగినా బూరుగచెట్టు ఏనుగును కట్టడానికి ఉపయోగించదు.

84 అతిదీర్ఘోఽపి కర్ణికారో న ముసలీభవతి.

అ. కర్ణికారం (కొండగోగు) కట్టె ఎంత పొడవుగా ఉన్నా రోకలిగా ఉపయోగించదు.

85. అతిదీప్తోఽపి ఖద్యోతో న పావకః.

అ. ఎంత ప్రకాశిస్తున్నా మెరుగుడుపురుగు నిప్పు కాదు.

86. న ప్రవృద్ధత్వం గుణహేతుః.

అ. (ధనాదులచేత) బాగా ఎదిగినంతమాత్రాన సద్గుణాలు రావు.

87. సుజీర్ణోఽపి పిచుమన్దో న శఙ్కులాయతే.

అ. ఎంత ముదిరినా వేపకట్టె అడకత్తెరకు (సరోతా) ఉపయోగపడదు.

88. యథా బీజం తథా నిష్పత్తిః.

అ. విత్తనాన్ని పట్టి దిగుబడి ఉంటుంది.

89. యథా శ్రుతం తథా బుద్ధిః.

అ. చదువును పట్టి బుద్ధి.

90. యథా కులం తథాచారః.

అ. కులాన్ని పట్టి ఆచారం (నడవడిక).

91. సంస్కృతః పిచుమందో న సహకారో భవతి.

అ. ఎంత దోహదం చేసినా వేప తియ్యమామిడి కాదు.

92. న చాగతం సుఖం త్యజేత్.

అ. వచ్చిన సుఖాన్ని విడిచిపెట్టుకోకూడదు.

93. స్వయమేవ దుఃఖమధిగచ్ఛతి.

అ. దుఃఖం దానంతట అదే వస్తుంది.

94. రాత్రిచారణం న కుర్యాత్.

అ. రాత్రులలో తిరుగకూడదు.

95. న చార్ధరాత్రం స్వపేత్.

అ. అర్ధరాత్రివేళ నిద్రపోకూడదు (అర్ధరాత్రివరకూ మేల్కొని అప్పుడు నిద్రపోగూడదు).

96. తద్విద్వద్భిః పరీక్షేత.
అ. దాన్ని (దేన్నైనా) విద్వాంసులతో కలిసి పరిశీలించాలి.

97. పరగృహమకారణతో న ప్రవిశేత్.
అ. కారణం లేకుండా ఇతరుల ఇంట్లోకి వెళ్ళకూడదు.

98. జ్ఞాత్వాపి దోషమేవ కరోతి లోకః.
అ. జనం తెలిసి కూడా తప్పులు చేస్తూంటారు.

99. శాస్త్రప్రధానా లోకవృత్తిః.
అ. లోకవ్యవహారం శాస్త్రం ప్రకారం జరగాలి.

100. శాస్త్రాభావే శిష్టాచారమనుగచ్ఛేత్.
అ. శాస్త్రం లేనప్పుడు శిష్టుల ఆచారం అనుసరించాలి.

101. నాచారితాచ్ఛాస్త్రం గరీయః.
అ. శాస్త్రం వాడుకలో ఉన్న శిష్టాచారం కంటె గొప్పది కాదు.

102. దూరస్థమపి చారచక్షుః పశ్యతి రాజా.
అ. రాజు గూఢచారు లనే నేత్రంతో దూరంగా ఉన్నదానిని కూడా చూస్తాడు.

103. గతానుగతికో లోకః.
అ. అందరూ ఒకరు ఏది చేస్తే అది చేస్తూ ఉంటారు (జనం గొఱ్ఱెల మంద).

104. యమనుజీవేత్ తం నాపవదేత్.
అ. ఎవర్ని ఆశ్రయించి జీవిస్తున్నాడో వారిని ఆడిపోసుకోకూడదు.

షష్ఠాధ్యాయం సమాప్తం.

# సప్తమాధ్యాయం

1. తపస్సార ఇన్ద్రియనిగ్రహః.

అ. అన్ని తపస్సులలోకి శ్రేష్ఠమైనది ఇంద్రియనిగ్రహం.

2. దుర్లభ స్త్రీబన్ధనాన్మోక్షః.

అ. స్త్రీబంధనంనుంచి మోక్షం దొరకడం చాల కష్టం.

3. స్త్రీ నామ సర్వాశుభానాం క్షేత్రమ్.

అ. స్త్రీ సకల అశుభాలకీ నిలయం (ఇది వైరాగ్యప్రవృత్తి ఉన్నవాళ్ళ విషయంలో చెప్పినది.)

4. న చ స్త్రీణాం పురుషపరీక్షా.

అ. దుష్టస్త్రీలు పురుషుడు ఎలాంటివాడో పరీక్షించరు.

5. స్త్రీణాం మనః క్షణికమ్.

అ. స్త్రీల మనసు క్షణంలో మారిపోతుంది.

6. అశుభద్వేషిణః స్త్రీషు న ప్రసక్తాః స్యుః.

అ. అశుభాలని ద్వేషించేవాళ్ళు స్త్రీలపై ఆసక్తులు కాకూడదు.

7. యజ్ఞఫలజ్ఞాస్త్రివేదవిదః.

అ. యజ్ఞాలను గూర్చి వాటి ఫలాలను గూర్చి తెలిసినవాళ్ళే మూడు వేదాలలో పండితుడు.

8. స్వర్గస్థానం న శాశ్వతమ్; అపి తు యావత్పుణ్యఫలమ్.

అ. స్వర్గంలో స్థితి శాశ్వతం కాదు. పుణ్యఫలం ఎంతవరకు ఉంటే అంతవరకే అది.

9. న చ స్వర్గపతనాత్పరం దుఃఖమ్.

అ. స్వర్గంనుండి పడిపోవడాన్ని మించిన దుఃఖం లేదు.

10. దేహీ దేహం త్యక్త్వా ఐన్ద్రపదం న వాఞ్ఛతి.

అ. ఏ వ్యక్తి తన దేహం విడిచి ఇంద్రపదవిని కూడా కోరడు. "ఇంద్ర పదవి లభిస్తుం దన్నా ఉన్న దేహం విడవడానికి ఇష్టపడరు" అని కాని లేదా స్వర్గంలో ఉండేది కొంతకాలమే అని తెలిసిన వాళ్ళెవరూ ఇంద్రపదవి కూడా కోరరు'' అని కాని భావం.

11. దుఃఖానామౌషధం నిర్వాణమ్.

అ. అన్ని దుఃఖాలకీ ఔషధం మోక్షమే.

12. అనార్యసంబన్ధాద్వరమార్యశత్రుతా.

అ. చెడ్డవాళ్ళ సంబంధంకంటె మంచివాళ్ళతో విరోధం మేలు.

13. నిహన్తి దుర్వచనం కులమ్.

అ. చెడ్డమాట కులాన్నే నశింపచేస్తుంది.

14. న పుత్రసంస్పర్శాత్ పరం సుఖమ్.

అ. పుత్రస్పర్శను మించిన సుఖం లేదు.

15. వివాదే ధర్మమనుస్మరేత్.

అ. వివాదం వచ్చినప్పుడు ధర్మాన్ని గూర్చి (ఏది ధర్మమా అని) ఆలోచించాలి.

16. నిశాన్తే కార్యం చిన్తయేత్.

అ. చేయవలసిన పనులు తెల్లవారుజామున ఆలోచించాలి.

17. ప్రదోషే న సంయోగః కర్తవ్యః.

అ. సాయంసంధ్యాకాలంలో స్త్రీసంయోగం చెయ్యకూడదు.

18. ఉపస్థితవినాశః దుర్నయం సునయం మన్యతే.

అ. వినాశం దగ్గరపడ్డవాడు చెడునీతిని మంచిదానినిగా భావిస్తాడు.

19. క్షీరార్థినః కిం కరిణ్యా.

అ. పాలు కావలసినవాడికి ఆడఏనుగు ఎందుకు ?

20. న దానసమం వశ్యమ్.

అ. దానంవంటి వశం చేసుకొనే ఉపాయం మరొకటి లేదు.

21. పరాయత్తేష్వూత్కణ్ఠాం న కుర్యాత్.

అ. పరాధీనమైనవాటివిషయంలో అత్యంతాసక్తి చూపకూడదు.

22. అసత్సమృద్ధిరసద్భిరేవ భుజ్యతే.

అ. చెడ్డవాళ్ళ సమృద్ధిని చెడ్డవాళ్ళే అనుభవిస్తారు.

23. నిమ్బఫలం కాకైర్హి భుజ్యతే.

అ. వేపపళ్ళు కాకులే తింటాయి కదా.

24. నామ్భోధిస్తృష్ణామపోహతి.

అ. సముద్రం దప్పిక తీర్చదు.

25. వాలుకా అపి స్వగుణమాశ్రయన్తి.

అ. కర్పూరం తన గుణాన్నే ఆశ్రయిస్తుంది. తన గుణాన్ని విడిచి పెట్టదు.

26. సన్తోఽసత్సు న రమన్తే.

అ. సత్పురుషులు అసత్పురుషులతో సుఖంగా కాలం గడపలేరు.

27. హంసః ప్రేతవనే న రమతే.

అ. హంస శ్మశానంలో క్రీడించజాలదు.

28. అర్థార్థం ప్రవర్తతే లోకః.

అ. ప్రతివాడూ ధనంకోసమే ప్రయత్నం చేస్తాడు.

29. ఆశయా బాధ్యతే లోకః.

అ. ఆశ ప్రతివానినీ బాధిస్తుంది.

30. న చాశాపరైః శ్రీః సహ తిష్ఠతి.

అ. లక్ష్మి దురాశకలవారితో కలిసి ఉండదు.

31. ఆశాపరే న ధైర్యమ్.

అ. దురాశకలవాడికి ధైర్యం ఉండదు.

32. దైన్యాన్మరణముత్తమమ్.

అ. దైన్యంకంటె మరణించడం ఉత్తమం.

33. ఆశా లజ్జాం వ్యపోహతి.

అ. ఆశ సిగ్గును పోగొడుతుంది.

34. న మాత్రా సహ వాసః కర్తవ్యః.

అ. తల్లితో అయినా కూడా (ఏకాంతస్థలంలో) ఉండకూడదు.

35. ఆత్మా న స్తోతవ్యః.

అ. తనను తాను పొగడుకోకూడదు.

36. న దివాస్వప్నం కుర్యాత్.

అ. పగలు నిద్రపోగూడదు.

37. న చాసన్నమపి పశ్యత్యైశ్వర్యాన్ధః; నాపి శృణోతీష్టం వాక్యమ్.

అ. ఐశ్వర్యమదాంధుడు దగ్గరివాళ్ళని కూడా చూడడు. ఇష్టవాక్యం వినడు.

38. స్త్రీణాం న భర్తుః పరం దైవతమ్. తదనువర్తనం తాసా ముభయసౌఖ్యమ్.

అ. స్త్రీలకు భర్తను మించిన దేవుడు లేడు. అతనికి అనుగుణంగా ఉండడం ఇహలోకంలోనూ పరలోకంలోనూ కూడా మంచిది.

39. అతిథిమభ్యాగతం చ పూజయేద్యథావిధి.

అ. అతిథినీ అభ్యాగతుణ్ణీ యథావిధిగా పూజించాలి.

40. నాస్తి హవ్యస్య వ్యాఘాతః.

అ. దేవతలకి సమర్పించిన హవ్యం ఎన్నడూ ఊరికే పోదు.

41. శత్రుర్మిత్రవద్భాతి.

అ. శత్రువు కూడా మిత్రుడులా కనబడుతూంటాడు.

42. మృగతృష్ణా జలవద్భాతి హి.

అ. ఎండమావులు జలం వలె కనబడతాయి కదా.

సప్తమాధ్యాయం సమాప్తం.

***

## అష్టమాధ్యాయం

1. దుర్మేధసో సచ్ఛాస్త్రం మోహయతి.

అ. మంచిశాస్త్రం మేధాశక్తి లేనివాళ్ళకి భ్రాంతి కలిగిస్తుంది.

2. సత్సఙ్గః స్వర్గవాసః.

అ. సత్పురుషసంగమే స్వర్గవాసం.

3. ఆర్యాః స్వమివ పరం మన్యన్తే.

అ. సత్పురుషులు పరాయివాణ్ణి కూడా తనవాడిలా భావిస్తారు.

4. రూపానువర్తీ గుణః.

అ. రూపాన్ని అనుసరించి గుణం ఉంటుంది.

5. యత్ర సుఖేన వర్తతే తదేవ స్థానమ్.

అ. ఎక్కడ సుఖంగా నివసించగలుగుతాడో అదే సరైన స్థానం (స్వస్థానం).

6. విశ్వాసఘాతినో న నిష్కృతిః.

అ. విశ్వాసఘాతుడికి ప్రాయశ్చిత్తం లేదు.

7. దైవాయత్తం న శోచేత్.

అ. దైవాధీనమైనదానిని గూర్చి విచారించకూడదు.

8. ఆశ్రితదుఃఖమాత్మన ఇవ మన్యతే సాధుః.

అ. సత్పురుషుడు తన ఆశ్రితులకు కలిగిన దుఃఖాన్ని తన దుఃఖం వలె భావిస్తాడు.

9. హృద్గతమాచ్ఛాద్యాన్యద్వదత్యనార్యః.

అ. అనార్యుడు (చెడ్డవాడు) మనస్సులో ఉన్నది దాచుకొని పైకి మరొకటి చెబుతాడు.

10. బుద్ధిహీనః పిశాచతుల్యః.

అ. బుద్ధి లేనివాడు పిశాచం వంటివాడు.

11. అసహాయః పథి న గచ్ఛేత్.

అ. కూడా ఎవరూ లేకుండా దూరప్రయాణాలు చేయకూడదు.

12. పుత్రో న స్తోతవ్యః

అ. పుత్రుణ్ణి స్తుతించకూడదు.

13. స్వామీ స్తోతవ్యోఽనుజీవిభిః.

అ. ఆశ్రయించి బ్రతికేవాళ్ళు ప్రభువును స్తుతిస్తూండాలి.

14. ధర్మకృత్యాని సర్వాణి స్వామిన ఇత్యేవ ఘోషయేత్.

అ. ధర్మబద్ధంగా జరుగుతూన్న పను లన్నీ ప్రభువుగారివే అని చాటి చెపుతూండాలి.

15. రాజాజ్ఞాం నాతిలఙ్ఘయేత్.

అ. రాజాజ్ఞ దాటకూడదు.

16. యథాఽఽజ్ఞప్తం తథా కుర్యాత్.

అ. ఎలా ఆజ్ఞాపిస్తే అలా చెయ్యాలి.

17. నాస్తి బుద్ధిమతాం శత్రుః.

అ. బుద్ధిమంతులకు శత్రువు ఉండదు.

18. ఆత్మచ్ఛిద్రం న ప్రకాశయేత్.

అ. తన లోపాన్ని బైటకు తెలియనీయకూడదు.

19. క్షమావానేవ సర్వం సాధయతి.

అ. ఓర్పుగలవాడే అన్నీ సాధించ కలుగుతాడు.

20. ఆపదర్థం ధనం రక్షేత్.

అ. ఆపత్కాలంలో ఉపయోగపడడానికి ధనం జాగ్రత్త పెట్టుకోవాలి.

21. సాహసవతాం ప్రియం కర్తవ్యమ్.

అ. సాహసవంతులకు పని సాధించడం అంటే చాలా ఇష్టం.

22. శ్వః కార్యమద్య కుర్వీత.

అ. రేపు చేయవలసిన పని నేడే చెయ్యాలి.

23. అపరాహ్ణికం పూర్వాహ్ణ ఏవ కర్తవ్యమ్.

అ. మధ్యాహ్నం తరవాత చేయవలసినది ప్రొద్దుటే చేయాలి.

24. వ్యవహారానులోమో ధర్మః.

అ. లోకవ్యవహారానికి అనుకూలంగా ఉండేదే ధర్మం.

25. సర్వజ్ఞతా లోకజ్ఞతా.

అ. లోకజ్ఞానం బాగా ఉండడమే సర్వజ్ఞత్వం.

26. శాస్త్రజ్ఞోఽప్యలోకజ్ఞో మూర్ఖతుల్యః.

అ. శాస్త్రపండితుడైనా లోకజ్ఞానం లేనివాడు మూర్ఖుడు వంటివాడు.

27. శాస్త్రప్రయోజనం తత్త్వదర్శనమ్.

అ. యథార్థస్థితిని తెలుసుకోవడమే శాస్త్రానికి ప్రయోజనం.

28. తత్త్వజ్ఞానం కార్యమేవ ప్రకాశయతి.

అ. ఒకడికి ఎంత తత్త్వజ్ఞానం ఉందో అతడు చేసే కార్యమే చెబుతుంది.

29. వ్యవహారే పక్షపాతో న కార్యః.

అ. వ్యవహారంలో పక్షపాతం చూపకూడదు.

30. ధర్మాదపి వ్యవహారో గరీయాన్.

అ. ధర్మంకంటెకూడా వ్యవహారం గొప్పది.

31. ఆత్మా హి వ్యవహారస్య సాక్షీ.

అ. వ్యవహారంలో అంతరాత్మయే సాక్షి.

32. సర్వసాక్షీ హ్యాత్మా.

అ. అంతరాత్మ అందరికీ సాక్షి కదా.

33. న స్యాత్ కూటసాక్షీ.

అ. అసత్యమైన సాక్ష్యం చెప్పేవాడు కాకూడదు.

34. కూటసాక్షిణో నరకే పతన్తి.

అ. కూటసాక్షులు నరకంలో పడతారు.

35. ప్రచ్ఛన్నపాపానాం సాక్షిణో భూతాని.

అ. రహస్యంగా పాపాలు చేసినవాళ్ళకి పంచమహాభూతాలే సాక్షులు.

36. ఆత్మనః పాపమాత్మైవ ప్రకాశయతి.

అ. (ఎప్పుడో ఒకప్పుడు) తన పాపాన్ని తానే బైట పెట్టుకుంటాడు.

37. వ్యవహారేఽన్తర్గతమాకారః సూచయతి.

అ. వ్యవహారంలోపల ఉన్న భావాన్ని ఆకారమే సూచిస్తుంది.

38. ఆకారసంవరణం దేవానామప్యశక్యమ్.

అ. దేవతలు కూడా ఆకారం కప్పిపుచ్చుకొనలేరు.

39. చోరరాజపురుషేభ్యో విత్తం రక్షేత్.

అ. దొంగలనుండి రాజపురుషులనుండి (అధికారులనుండి) ధనం రక్షించు కోవాలి.

40. దుర్దర్శనా హి రాజానః ప్రజా నాశయన్తి.

అ. చూడడానికి శక్యం కాని (వచ్చినవాళ్ళకి దర్శనం ఇవ్వని) రాజులు ప్రజల్ని నశింపచేస్తారు.

41. సుదర్శనా రాజానః ప్రజా రక్షన్తి.

అ. సులభంగా దర్శనం ఇచ్చే రాజులు ప్రజల్ని రక్షిస్తారు.

42. న్యాయయుక్తం రాజానం మాతరం మన్యన్తే ప్రజాః.

అ. న్యాయంగా ఉండే రాజును ప్రజలు తల్లిగా భావిస్తారు.

43. తాదృశః స రాజా ఇహ సుఖం తతః స్వర్గం ప్రాప్నోతి.

అ. అలాంటి రాజు ఇహలోకంలో సుఖం పొందుతాడు. తరవాత స్వర్గం పొందుతాడు.

44. అహింసాలక్షణో ధర్మః.

అ. ఎవరినీ హింసించకపోవడమే (తన మనోవాక్కాయాలచేత ఇతరుల మనఃకాయాలకు బాధ కలిగించకపోవడమే) ధర్మానికి లక్షణం.

45. స్వశరీరమపి పరశరీరం మన్యతే సాధుః.

అ. సత్పురుషుడు తన శరీరాన్ని కూడా పరుల శరీరంగానే (అనగా పరోపకారం కొరకు ఉపయోగించవలసిన దానినిగా) భావిస్తాడు.

46. మాంసభక్షణమయుక్తం సర్వేషామ్.

అ. అందరికీ కూడా మాంసభక్షణం అయుక్తమైనది.

47. న సంసారభయం జ్ఞానవతామ్.

అ. తత్త్వజ్ఞానం ఉన్నవాళ్ళకి సంసారంవల్ల భయం ఉండదు.

48. విజ్ఞానదీపేన సంసారభయం నివర్తయతి.

అ. తత్త్వజ్ఞానం అనే దీపంచేత సంసారభయం తొలగించుకుంటాడు.

49. సర్వమనిత్యం భవతి.

అ. ప్రతీదీ అనిత్యమే.

50. కృమిశకృన్మూత్రభాజనం శరీరం పుణ్యపాపజన్మహేతుః.

అ. కృములూ, మలమూ, మూత్రమూ-వీటికి స్థానమైన ఈ శరీరం పుణ్యం చేయడానికైనా పాపంచేయడానికైనా సాధనం.

51. జన్మమరణాదిషు తు దుఃఖమేవ.

అ. జన్మమరణాలలో దుఃఖమే కాని సుఖం లేదు.

52. తపసా స్వర్గమాప్నోతి.

అ. తపస్సుచేత స్వర్గం పొందుతాడు.

53. క్షమాయుక్తస్య తపో వివర్ధతే.

అ. ఓర్పు ఉన్నవాని తపస్సు పెరుగుతుంది.

54. తస్మాత్ సర్వేషాం సర్వకార్యసిద్ధిర్భవతి.

అ. తపస్సువల్ల అందరికీ అన్ని కార్యాలూ సిద్ధిస్తాయి.

అష్టమాధ్యాయం సమాప్తము.

చాణక్యనీతిసూత్రాలు సమాప్తమైనవి.

పుల్లెల శ్రీరామచంద్రుడు రచించిన బాలానందినీవ్యాఖ్య సమాప్తము.

యత్కృపాలేశసంసర్గాదనువాదః కృతో మయా,
తస్యైవ జానకీజానేః పదయోరర్పయమర్ప్యతే.
దేవతానుగ్రహః పిత్రోస్తపశ్చాచార్యసత్కృపా,
కర్త్రాస్మద్గ్రిన్థజాతస్య కరణం కేవలం వయమ్.

శ్రీః శ్రీః శ్రీః

# భారతీయ విజ్ఞాన గ్రంథ విక్రయశాల

# Indological Book Centre

నిర్వహణ : సంస్కృత భాషా ప్రచారసమితి [జి. పుల్లారెడ్డి చారిటీస్ ట్రస్ట్ అనుబంధ సంస్థ]

5-4-743,హరేకృష్ణ దేవాలయం ప్రక్కన, నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాదు - 1

ఫోను నం. 515481, 509925

## సమితి ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | సంస్కృతభారతీ ప్రవేశికా | 3 |
| 2. | సంస్కృతభారతీ ప్రథమా | 10 |
| 3. | సంస్కృతభారతీ ద్వితీయా | 12 |
| 4. | సంస్కృతభారతీ తృతీయా | 15 |
| 5. | సంస్కృతభారతీ విస్నాత ద్వితీయ ప్రశ్నపత్ర పాఠ్యభాగము | 12 |
| 6. | సంస్కృతభారతీ విస్నాత తృతీయ ప్రశ్నపత్ర పాఠ్యభాగము | 6 |
| 7. | సంస్కృతనిబంధావళిః | 10 |
| 8. | దేవ్యపరాధక్షమాపణస్తోత్రం | 2 |
| 9. | కిరాతార్జునీయము (తృతీయసర్గ) | 15 |
| 10. | गद्यसंग्रहः | 8 |
| 11. | रूपकपरिचयः | 4 |
| 12. | निबन्धभास्करः | 6 |
| 13. | మేఘసందేశము (సటీక) | 45 |
| 14. | ఆదికవి వాల్మీకి | 1 |
| 15. | వ్యాసమహర్షి | 2 |
| 16. | మహాకవి కాళిదాసు | 2 |
| 17. | పంచతంత్రము-ఆంధ్రవివరణతో | |
| | I మిత్రభేదం, మిత్రప్రాప్తికం | 28 |
| | II కాకోలూకీయం, లబ్ధప్రణాశమ్ etc., | 25 |
| 18. | హితోపదేశః I | 32 |
| 19. | హితోపదేశః II | 30 |
| 20. | సంస్కృత స్వబోధిని I | 30 |
| 21. | సంస్కృతసూక్తి రత్నకోశః I | 16 |
| 22. | సంస్కృతసూక్తి రత్నకోశః II | 24 |
| 23. | భవభూతి భారతి | 16 |
| 24. | చాణక్యనీతిసూత్రాలు | 8 |
| 25. | నీతివాక్యామృతం (సోమదేవుడు) | 45 |
| 26. | శుకసందేశః | 24 |
| 27. | వివేకచూడామణి (ఆంధ్రవ్యాఖ్యతో) | 120 |
| 28. | కావ్యప్రకాశః (ఆంధ్రవ్యాఖ్యతో) | 150 |
| 29. | నాగానందము (ఆంధ్రానువాదం) | 18 |
| 30. | సంస్కృతవ్యాఖ్యానవిమర్శ - సంప్రదాయం | 5 |

## ఇతర ప్రచురణలు

### తెలుగు ద్వారా సంస్కృతం నేర్చుకొనుటకు గ్రంథాలు

| | | |
|---|---|---|
| 1. | బాలబోధిని I | 5 |
| 2. | బాలబోధిని II | 15 |
| 3. | సంస్కృతపథప్రదర్శిని | 30 |
| 4. | శబ్దమంజరి (తెలుగు) | 16 |
| 5. | శబ్దమంజరి (నాగరి) | 15 |
| 6. | అమరకోశం 1వ కాండ | 5 |
| 7. | అమరకోశం త్రికాండ | 20 |
| 8. | సంస్కృత పాఠమాల I (మూలం - శ్రీపాద దామోదర్ సాత్వలేకర్) | 10 |
| 9. | సంస్కృత వ్యవహార సాహస్రీ | 5 |
| 10. | వ్యావహారిక సంస్కృతం | 10 |

### హిందీద్వారా

| | | |
|---|---|---|
| 1. | संस्कृत व्यवहार साहस्री | 15 |
| 2. | प्रारम्भिकरचनानुवादकौमुदी | 15 |
| 3. | रचनानुवादकौमुदी | 36 |
| 4. | प्रौढरचनानुवादकौमुदी | 70 |
| 5. | संस्कृतनिबन्धशतकम् | 60 |
| 6. | संस्कृतव्यकरणप्रवेशिका | 8 |

### ఇంగ్లీషుద్వారా

| | | |
|---|---|---|
| 1. | Infant Reader | 10 |
| 2. | Reader I | 12 |
| 3. | Reader II | 10 |
| 4. | Reader III | 10 |
| 5. | First book of Sanskrit (Bhandarkar) | 25 |
| 6. | Second book of Sanskrit do | 40 |
| 7. | Samskrita Vyavahara Sahasri | 7 |
| 8. | Sabdamanjari | 14 |
| 9. | Dhatumanjari | 16 |
| 10. | Exercises in Sanskrit Translation | 10 |
| 11. | Student's Sanskrit-English Dictionary | 145 |
| 12. | Descriptive Grammer of Simple Sanskrit | 15 |